బుధవారం
31-08-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 71
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

కృష్ణకు మళ్లీ వరద

శ్రీశైలం నుంచి ప్రకాశం బ్యారేజీ వరకు గేట్లన్నీ ఎత్తివేత

తీర ప్రాంత ప్రజలను అప్రమత్తం చేసిన అధికారులు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: కృష్ణమ్మ మరోమారు ఉగ్రరూపం దాల్చింది. నారాయణపూర్ డ్యామ్ దిగువన కృష్ణా ప్రధాన పాయ, తుంగభద్ర పరీవాహక ప్రాంతాలో విస్తారంగా కురిసిన వర్షాలతో శ్రీశైలం నుంచి ప్రకాశం బ్యారేజీ వరకు అన్ని ప్రాజెక్టులు పొంగిపొర్లుతున్నాయి. దీంతో తీర ప్రాంత ప్రజలతో పాటు లోతట్టు గ్రామాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేస్తున్నారు. శ్రీశైలం ప్రాజెక్టులోకి దాదాపు 4లక్షల క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుండగా, ఆ నీటి మొత్తాన్ని10 గేట్లు ఎత్తి దిగువకు విడుదల చేస్తున్నారు. నెల రోజుల వ్యవధిలోనే ఈ స్థాయి భారీ వరద రావడం ఇది రెండోసారి కావడం గమనార్హం.

పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా 15,833, హంద్రీ-నీవా ద్వారా 914, కల్వకుర్తి ద్వారా 1,167 క్యూసెక్కులు తరలిస్తున్నారు. పది గేట్లను 15 అడుగుల మేర ఎత్తి 3,75,680 క్యూసెక్కులను, కుడి, ఎడమ గట్టు కేంద్రాల్లో విద్యుదుత్పత్తి చేస్తూ 62,112 క్యూసెక్కులు, మిగిలిన వరద నీటిని దిగువకు వదిలేస్తున్నారు. ప్రస్తుతం శ్రీశైలంలో 884.2 అడుగుల్లో 210.99 టీఎంసీల నీరు నిల్వ ఉంది. అయితే మంగళవారం సాయంత్రానికి కొంత వరద తగ్గుముఖం పట్టినట్లు అధికారులు చెబుతున్నారు. దీంతో సాగర్ ప్రాజెక్టు నుంచి 3,66,414 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. కుడి, ఎడమ కాలువలు, ఏఎమ్మార్పీ, వరద కాలువలకు 20,589 క్యూసెక్కులు వదులుతున్నారు. సాగర్ స్పిల్ వే 26 గేట్లు, ప్రధాన విద్యుత్‌కేంద్రం ద్వారా ఎగువ నుంచి వచ్చే నీటిని మొత్తం దిగువకు వదిలేస్తున్నారు. ప్రస్తుతం సాగర్‌లో 588.6 అడుగుల్లో 307.87 టీఎంసీల నీరు నిల్వ ఉంది. సాగర్ నుంచి భారీగా నీరు విడుదల చేయడంతో దిగువున లోతట్టు ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. సాగర్ నుంచి విడుదల చేస్తున్న ప్రవాహం పులిచింతల ప్రాజెక్టులోకి చేరుతుండగా, ఈ మొత్తం నీటిని పులిచింతల గేట్లు అన్నీ ఎత్తి దిగువకు వదులుతున్నారు. ప్రస్తుతం

- మిగతా 2 లో

ఆగని అరెస్టులు...
బెదిరింపులు

- ఉద్యోగులపై ఖాకీల అత్యుత్సాహం
- ఉద్యమం వాయిదా వేసినా వేధింపులు
- వినాయక చవితికి జైళ్లలో మగ్గేలా కుట్ర
- ఉపాధ్యాయ ఎమ్మెల్సీల ఆగ్రహం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఖాకీల దూకుడు తగ్గలేదు. అవే బెదిరింపులు... నిర్బంధాలు... బైండోవర్ కేసులు... ఉపాధ్యాయ, ఉద్యోగులను పోలీసులు భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. సీపీఎస్ రద్దు ఉద్యమం పేరుతో అత్యుత్సాహాన్ని ప్రదర్శిస్తున్నారు. సెప్టెంబరు 1న చలో మిలీనియమ్ మార్చ్ విజయవాడను సీపీఎస్ ఉద్యోగ సంఘాలు ఈ నెల 11వ తేదీకి వాయిదా వేసినట్లు ప్రకటించినా, పోలీసులు వెనక్కి తగ్గడం లేదు. ఇంకా ఉపాధ్యాయులను, పిలుపునిచ్చిన ఉద్యోగ సంఘాల నేతలను అరెస్టు చేస్తూనే ఉన్నారు. వారిపై సెక్షన్ 107, 141, 149 పేరుతో బైండోవర్ కేసులు నమోదు చేసి, స్థానిక తహశీల్దార్ల ఎదుట ప్రవేశ పెట్టడం తీవ్ర వివాదాస్పదంగా మారుతోంది. వినాయక చవితి పండుగనాడు సైతం జైళ్లలో మగ్గేలా వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారు. చాలా మంది సీపీఎస్ ఉద్యోగ సంఘాల నేతలను పోలీసులు తీసుకెళ్లిపోయారు. వారెక్కడ ఉన్నారో అంతు చిక్కడం లేదు. ఈ చర్యలతో అభద్రతా వాతావరణాన్ని పోలీసులు సృష్టిస్తున్నారు. కర్నూలు జిల్లా గోనెగండ్ల సబ్ ఇన్‌స్పెక్టర్ అధ్వర్యంలో 15 మంది ఉపాధ్యాయులను తహసీల్దార్ వేణుగోపాల్ ముందు ప్రవేశ పెట్టారు. హిందువులు

- మిగతా 2 లో

పాఠకులకు, ప్రకటనకర్తలకు, ఏజెంట్లకు, శ్రేయోభిలాషులకు
వినాయకచవితి శుభాకాంక్షలు
- జనరల్ మేనేజర్

సెలవు

వినాయకచవితి సందర్భముగా నేడు మా కార్యాలయానికి సెలవు. కావున గురువారం పత్రిక వెలువడదు. పునర్దర్శనం శుక్రవారం గమనించగలరు.

సీబీఐ నాకు క్లీన్‌చిట్ ఇచ్చింది

బ్యాంకు లాకర్ సోదా తర్వాత సిసోడియా

ఘజియాబాద్: బ్యాంకు లాకర్‌ను సోదా చేసిన తర్వాత సీబీఐ తనకు 'క్లీన్ చిట్' ఇచ్చిందని ఢిల్లీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా తెలిపారు. మంగళవారం విచారణ సంస్థ బృందం తన లాకర్‌ను సుమారు రెండు గంటల పాటు పరిశీలించిందని అన్నారు. దేశ రాజధాని శివార్లలోని ఘజియాబాద్, వసుంధరలోని పంజాబ్ నేషనల్ బ్యాంక్ బ్రాంచ్‌లో సీబీఐ నలుగురు సభ్యుల బృందం సోదాలు నిర్వహించినప్పుడు సిసోడియా, ఆయన భార్య అక్కడే ఉన్నారు. ఢిల్లీ ప్రభుత్వ మద్యం విధానం 2021-22 అమలులో అక్రమాలకు సంబంధించి సీబీఐ నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్న 15 మంది వ్యక్తులు, సంస్థలలో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) నాయకుడు సిసోడియా కూడా ఉన్నారు. కాగా సీబీఐ ఒత్తిడితో వ్యవహరిస్తోందని సోదాలు ముగిసిన అనంతరం సిసోడియా విలేకరులతో అన్నారు. 'ఈరోజు సోదాల్లో సీబీఐ నుంచి నాకు క్లీన్ చిట్ లభించినందుకు సంతోషంగా ఉంది. నా లాకర్ లేదా నివాసంపై జరిపిన సోదాలలో వారు ఏమీ కనుగొనలేదు' అని తెలిపారు. 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు ప్రధాని నరేంద్ర మోదీకి ప్రత్యామ్నాయంగా

- మిగతా 2 లో

కర్ణాటక ఈద్గా మైదానంలో
గణేశ్ ఉత్సవాలు వద్దు

సుప్రీంకోర్టు తీర్పు

న్యూఢిల్లీ / బెంగళూరు : కర్ణాటక ఈద్గా మైదానంలో గణేశ్ ఉత్సవాలను నిర్వహించవద్దని సర్వోన్నత న్యాయస్థానం మంగళ వారం తీర్పు వెలువరించింది. చతుర్థి వేడుకల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతివ్వడంపై కర్ణాటక వక్ఫ్ బోర్డు అభ్యంతరం వ్యక్తం చేసింది. దీనిపై సుప్రీంకోర్టుకు వెళ్లింది. సుప్రీం త్రిసభ్య ధర్మాసనం కేసును విచారించడంతో ఈ వివాదం కొలిక్కి వచ్చింది. మంటపాలకు అనుమతివ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడిచేయగా సుప్రీంకోర్టు తాజా తీర్పు చర్చనీయాంశంగా మారింది. గణేశ్ మండపాల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి ఇవ్వవచ్చు అని రాష్ట్ర హైకోర్టు పేర్కొనగా దీనిపై వక్ఫ్ బోర్డు సుప్రీంకోర్టుకు వెళ్లింది. 200 ఏళ్లుగా ఈ స్థలంలో ఇటువంటి మతపరమైన కార్యక్రమాలను నిర్వహించలేదని వాదించింది. దీంతో మధ్యంతర ఉత్తర్వులను సుప్రీం త్రిసభ్య ధర్మాసనం జారీ చేసింది. వేడుకల కోసం మైదానాన్ని వాడవద్దని స్పష్టంచేసింది. అయితే ఈ స్థలం ఎవరిది? రాష్ట్ర ప్రభుత్వం పరిధిలోనిదా లేక వక్ఫ్ బోర్డుకు చెందినదా అన్నది హైకోర్టు విచారణలో ఉంది. వక్ఫ్‌బోర్డు తరఫున దుశ్యంత్ దవే సుప్రీంకోర్టులో వాదనలు వినిపించారు. 'మతపర మైన మైనారిటీల హక్కులను ఈ విధంగా కాల రాయొద్దు. ఈ స్థలంలో ఏ మతానికి సంబంధించిన కార్యక్రమాలను నిర్వహించలేదు. చట్ట ప్రకారం ఇది వక్ఫ్‌బోర్డు స్థలం. ఆకస్మికంగా 2022లో వివాదా స్పద భూమిగా సృష్టించి... గణేశ్ ఉత్సావాలు నిర్వహిం చాలని కోరుకుంటున్నారు' అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున న్యాయవాది వాదనలు వినిపిస్తూ 'ఇక్కడేమీ శాశ్వత కట్టడం ఉండదు. రెండు రోజుల కోసం

- మిగతా 2 లో

ఏపీలో పెట్టుబడులపై ఆసక్తి

- సీఎంతో టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ ప్రతినిధుల భేటీ
- రక్షణ, వైమానిక రంగంలో తయారీ, నిర్వహణ అంశాలపై చర్చ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో రక్షణ, వైమానిక రంగంలో తయారీ, నిర్వహణ తదితర అంశాల్లో పెట్టుబడులు పెట్టడానికి టాటా ఆసక్తి కనబరుస్తోంది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితో మంగళవారం టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ ప్రతినిధులు సీఎం క్యాంప్ కార్యాలయంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు, అవకాశాలపై వారు సీఎంతో సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యంగా రక్షణ వైమానిక రంగంలో తయారీ, నిర్వహణ తదితర అంశాల్లో పెట్టుబడులు, అవకాశాలపై చర్చించినట్లు అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే అంశంలో ఎలాంటి సహాయ సహకారాలు అందించడానికైనా తాము సిద్ధంగా ఉన్నామని ముఖ్యమంత్రి వారికి హామీ ఇచ్చారు. పారిశ్రామికంగా అనుసరిస్తున్న పారదర్శక విధానాలను వివరించారు. సుశిక్షితులైన మానవ వనరులు, మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ కార్పొరేట్ ఎఫైర్స్, రెగ్యులేటరీ హెడ్ జె.శ్రీధర్, టాటా ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ హెడ్ మసూద్ హుస్సేనీలతో పాటు పరిశ్రమల శాఖ స్పెషల్ సీఎస్ కరికాల్ వలవెన్, ఏపీఈడీబీ సీఈవో జవ్వాది సుబ్రహ్మణ్యం, సీఎంవో అధికారులు పాల్గొన్నారు.

క్రీడా విజేతలను అభినందించిన సీఎం జగన్

రాష్ట్రానికి చెందిన అంతర్జాతీయ ఫెన్సింగ్ క్రీడాకారిణి మురికినాటి బేబి రెడ్డి, పారా ఏషియన్ ట్రాక్ సైక్లింగ్ చాంపియన్ షేక్ అర్షద్, కోచ్ ఆదిత్య మంగళవారం సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రిని కలిశారు. అంతర్జాతీయ వేదికలపై తెలుగువారి ఖ్యాతిని నిలబెడుతున్న ఈ క్రీడాకారులను సీఎం అభినందించారు. వైసీపీ

- మిగతా 2 లో

ప్రముఖ వ్యవసాయ ఆర్థికవేత్త
అభిజిత్ సేన్ కన్నుమూత

న్యూఢిల్లీ: ప్రముఖ వ్యవసాయ ఆర్థికవేత్త ప్రొఫెసర్ అభిజిత్ సేన్ (72) గుండెపోటుతో సోమవారం రాత్రి కన్నుమూశారు. ఈ విషయాన్ని ఆయన సోదరుడు డాక్టర్ ప్రణబ్ సేన్ ప్రకటించారు. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వ హయాంలో 2004 నుంచి 2014 వరకూ అభిజిత్ సేన్ ప్రణాళికా సంఘం సభ్యుడిగా పని చేశారు. అంతకుముందు అతల్ బిహారి వాజ్‌పేయి ప్రభుత్వంలో వ్యవసాయ ఖర్చులు, ధరల కమిషన్ (సీఏసీపీ) చైర్మన్‌గా కొనసాగారు. ఢిల్లీలోని జేఎన్‌యూలో పీహెచ్‌డీ పూర్తి చేసిన ఆయన..అదే విశ్వవిద్యాలయంలో ఆర్థికశాస్త్ర విభాగంలో ఆచార్యులుగా పనిచేశారు. అభిజిత్ సేన్‌కు గొప్ప ప్రజా సైన్సు ఉద్యమ నేతగా గుర్తింపు ఉంది. యూపీఏ హయాంలో రూపుదిద్దుకున్న జాతీయ గ్రామీణ ఉపాధి పథకం రూపకల్పనలో సేన్ కీలకపాత్ర వహించారు. ప్రజా అనుకూల ఆర్థికవేత్తగా

- మిగతా 2 లో

కాంగ్రెస్ అధ్యక్ష పదవికి
థరూర్ పోటీ?

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అధ్యక్ష పదవికి ఎంపీ శశి థరూర్ పోటీ చేసేలా కనిపిస్తోంది. దాదాపు 22 ఏళ్ల తర్వాత జరగనున్న ఈ అధ్యక్ష ఎన్నికల్లో గాంధీ కుటుంబీకులు దూరంగా ఉండాలని చాలామంది భావిస్తున్నారు. అయితే అధ్యక్ష పదవికి రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ పేరును గాంధీ కుటుంబం ప్రతిపాదిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో శశిథరూర్ అధ్యక్ష పదవికి పోటీపడటం ప్రాధాన్యం సంతరించుకుంది. శశిథరూర్ తాజాగా మలయాళం దినపత్రిక 'మాతృభూమి'లో రాసిన వ్యాసంలో ఆయన మనసులోని మాటను బయటపెట్టారని

- మిగతా 2 లో

విపక్ష ఐక్యతకు ఇదే స్ఫూర్తి

ఆపరేషన్ కమలాన్ని తిప్పికొట్టిన నితీశ్-లాలు

- బీజేపీ 'కుట్ర' రాజకీయాలకు బీహారు అడ్డుకట్ట
- 2024 ఎన్నికలే లక్ష్యంగా ఐక్యకార్యాచరణతో ముందుకు...

పాట్నా: అన్ని రాష్ట్రాల్లో తామే అధికారంలో ఉండాలని భారతీయ జనతా పార్టీ (బీజేపీ) కుట్రలు చేస్తోంది. ఇందుకోసం అన్ని చోట్ల ఆపరేషన్ కమలానికి పూనుకుంటోంది. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలను ఒక్కొక్కటిగా కూల్చివేస్తోంది. మొన్న కర్ణాటక, గోవా, అసోం, నిన్న మహారాష్ట్ర, నేడు బీహార్, ఢిల్లీలోనూ ఇదే పంథాను అనుసరిస్తోంది. ఆపరేషన్ కమలానికి లాలూ-నితీశ్ జోడి దీటుగా బదులిచ్చింది. కమల దళం వ్యూహాలను తిప్పికొట్టి బీహార్‌లో మహాకూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. బీజేపీ 'మెలిపెట్టే' రాజకీయాలతో నితీశ్ కుమార్, లాలూ ప్రసాద్ వైఖరిలో మార్పు రాలేదు. ఇద్దరూ ఐక్యంగా నిలబడి బీజేపీని ఏ విధంగా ఎదుర్కోవాలో చేసి చూపించారు. 2024 ఎన్నికలలో బీజేపీని మట్టికరిపించే దిశగా పావులు కదుపుతున్నారు. ఈనెల 24న బీహార్ అసెంబ్లీలో జరిగిన విశ్వాస పరీక్షలో నితీశ్ కుమార్ నెగ్గి రాష్ట్రంలో మహాకూటమి (మహాఘట్బంధన్) ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. ఇదే క్రమంలో ముగ్గురు రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్జేడీ) శాసనసభ్యుల ఇళ్లు, కార్యాలయాలపై సీబీఐ దాడులు జరిగాయి. కేంద్ర హోం శాఖ బాధ్యతలను అమిత్ షా చేపట్టినప్పటి నుంచి బీజేపీయేతర పార్టీలపై సీబీఐ, ఈడీ, ఐటీ దాడులు పరిపాటిగా మారాయి. తమ రాజకీయ ప్రత్యర్థులపై ఈ దర్యాప్తు సంస్థలను అస్త్రాలుగా బీజేపీ ప్రభుత్వం ప్రయోగిస్తోంది. లోక్‌సభ, రాజ్యసభలలో 400 మంది, 12 రాష్ట్రాల శాసనసభల్లో 1300 మంది సభ్యులు బీజేపీకి ఉన్నారు. బీజేపీ ఎనిమిదేళ్ల పాలనలో ఆ పార్టీకి చెందిన ఏ ఒక్క చట్టసభ్యుడిపైనా దర్యాప్తు జరిపిన

- మిగతా 2 లో

ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు

- ప్రథమ 35, ద్వితీయ 33 శాతం ఉత్తీర్ణత నమోదు
- ద్వితీయ సంవత్సరం 50,691 మంది...
- వివరాలు వెల్లడించిన ఇంటర్ బోర్డు కార్యదర్శి శేషగిరిబాబు

2లో

ఈపీఎఫ్ఓ కొత్త ప్రతిపాదనలు

ఎంప్లాయ్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్ఓ) శుభవార్త చెప్పింది. ప్రస్తుతం ఉన్న నిబంధనల్ని సవరించనుంది. కొత్త నిబంధనల్ని అమలు చేయనుంది.

8లో

కాంగ్రెస్ అధ్యక్ష పదవికి థరూర్ పోటీ?

(మొదటిపేజీ తరువాయి)

రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ వ్యాసంలో ఆయన బ్రిటన్‌లో మాదిరిగానే కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికలు జరపాలని అభిప్రాయపడ్డారు. బ్రిటన్‌లో బోరిసన్ జాన్సన్ ప్రధాని పదవికి రాజీనామా అనంతరం ఆ పదవి కోసం కన్జర్వేటివ్ పార్టీలో జరుగుతున్న ఎన్నికల మాదిరిగానే కాంగ్రెస్‌లోనూ జరగాలని ఆయన పేర్కొన్నారు. ఈ పదవికి పోటీ చేసే అభ్యర్థులు తమ విజన్‌ను పార్టీ ముందుంచితే తప్పనిసరిగా అది ప్రజల్లో ఆసక్తి కలిగిస్తుందని చెబుతున్నారు.

ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో నాయకత్వం విషయంలో కొంత శూన్యత నెలకొందని, ఈ ప్రభావం నుంచి బయటపడాలంటే ఎన్నికలు జరపాలని థరూర్ అభిప్రాయపడ్డారు. ఎన్నికల్ని స్వేచ్ఛగా నిర్వహిస్తే.. అది పార్టీ కార్యకర్తలపైనా, ప్రజలపైనా ప్రభావం చూపుతుందని ఆయన పేర్కొన్నారు. ఇక పార్టీ బలోపేతానికి కృషి చేసిన వారిలో శశిథరూర్ కూడా ఉన్నారు. పార్టీకి పునరుత్తేజం రావాలంటే తప్పనిసరిగా అధ్యక్ష పదవికి ఎన్నికలు జరపాలని సోనియాగాంధీకి లేఖ రాసిన జీ-23 నేతల్లో శశిథరూర్ ఉన్నారు. 2000 సంవత్సరంలో కాంగ్రెస్ అధ్యక్ష పదవికి ఎన్నికలు జరిగాయి. మళ్లీ 22 ఏళ్ల తర్వాత అధ్యక్ష పదవికి ఎన్నికలు జరగనున్నాయి. 2000 నంబరులో సోనియాగాంధీపై జితేంద్ర ప్రసాద పోటీ చేశారు. సోనియాకు 7,542 ఓట్లు రాగా, జితేంద్రకు కేవలం 94 మాత్రమే వచ్చాయి. అయితే ప్రజాస్వామ్య స్ఫూర్తి కోసమే పోటీ చేసినట్టు నాడు జితేంద్ర ప్రకటించారు.

అభిజిత్ సేన్ కన్నుమూత

(మొదటిపేజీ తరువాయి)

గుర్తింపు ఉన్న ఆయన...యూపీఏ ప్రభుత్వంతో చర్చలు జరిపి వ్యవసాయ రుణాలు మాఫీ చేయించడంలోనూ కీలకంగా వ్యవహరించారు. ఆయనకు భార్య ప్రొఫెసర్ జయతి ఘోశ్, కుమార్తె జాహ్నవి ఉన్నారు. జయతి ఘోశ్ సైతం వ్యవసాయ ఆర్థికవేత్తగా పేరుగడించారు.

ప్రోగ్రెసివ్ ఫోరం సంతాపం: ప్రొఫెసర్ అభిజిత్ సేన్ ఆకస్మిక మరణం వ్యవసాయ రంగానికి తీరని లోటని ఆలిండియా ప్రోగ్రెసివ్ ఫోరం ఆంధ్రప్రదేశ్ శాఖ పేర్కొంది. ఆయన మృతికి సంతాపం తెలిపింది. సీనియర్ వ్యవసాయ శాస్త్రవేత్త మర్ల సోమసుందర్ కూడా ఓ ప్రకటనలో సంతాపం ప్రకటించారు. అభిజిత్‌సేన్ మంచి వక్త అని, ఆయన సేవలు మరువలేనివని పేర్కొన్నారు. అభిజిత్ సేన్ భార్య జయతీఘోశ్‌కు సానుభూతి ప్రకటించారు.

అభిజిత్ సేన్ మృతికి ఏఐకేఎస్, ఏపీ రైతు సంఘం సంతాపం

విశాలాంధ్ర-విజయవాడ: ప్రొఫెసర్ అభిజిత్ సేన్ ఆకస్మిక మృతికి ఏఐకేఎస్ అధ్యక్షుడు రావుల వెంకయ్య, ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ మంగళవారం ఓ ప్రకటనలో తీవ్ర సంతాపం ప్రకటించారు. అభిజిత్‌సేన్ ప్రారంభంలో ఆక్స్‌ఫర్డ్, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో బోధించారని తెలిపారు. పేదరికం తగ్గింపు, సంక్షేమ ఆర్థిక శాస్త్రంలో ఈపీడబ్ల్యులో ఆయన వ్యాసాలు క్రమం తప్పకుండా ప్రచురితమయ్యాయని గుర్తు చేసుకున్నారు. అభిజిత్ సేన్ లేని లోటు తీర్చలేనిదని పేర్కొంటూ ఆయన సతీమణి జయతీ ఘోశ్‌కు ప్రగాఢ సంతాపం తెలిపారు.

సీబీఐ నాకు క్లీన్‌చిట్ ఇచ్చింది

(మొదటిపేజీ తరువాయి)

ఆవిర్భవించిన ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను అడ్డుకునేందుకే తనను తప్పుడు కేసులో నిందితుడిగా చేర్చారని సిసోడియా చెబుతున్నారు.

బీజేపీ 'బచా చోర్' పార్టీ: దిల్లీ అసెంబ్లీలో ఉప ముఖ్యమంత్రి సిసోడియా మంగళవారం పిల్లల కిడ్నాప్ కేసులో బీజేపీ కార్పొరేటర్‌ను అరెస్టు చేసిన విషయాన్ని ప్రస్తావిస్తూ, బీజేపీ 'బచా చోర్' పార్టీ అని అభివర్ణించారు. సీబీఐ సోదాల్లో తన లాకర్‌లో ఆస్తి కాగితాలు దొరికాయని తప్పుడు వార్తలు వచ్చాయని సిసోడియా చెప్పారు. 'ప్రతిపక్షాల ప్రశ్నలన్నింటికీ మేం సమాధానమిచ్చాం. వారు చెప్పే అబద్ధాలకు సమాధానం చెప్పలేం. లాకర్‌లో నా కొడుకు జుంజునాకి చెందిన ఒక బొమ్మ సహా రూ.70 వేల నుంచి 80 వేల విలువైన వస్తువులు మాత్రమే సీబీఐకి దొరికాయి' అని ప్రతిపక్ష ఎమ్మెల్యేల ఆందోళన మధ్య సిసోడియా అన్నారు. సభలో గందరగోళం కొనసాగుతుండగా, డిప్యూటీ స్పీకర్ రాఖీ బిర్లా ప్రతిపక్ష నాయకుడు రాంవీర్ సింగ్ బిధూరి మినహా మిగతా బీజేపీ ఎమ్మెల్యేలను బయటకు పంపారు. వారు కూడా నిరసనగా వాకౌట్ చేశారు. ఆరు రోజుల క్రితం మధుర జంక్షన్ ప్లాట్‌ఫారమ్ నుంచి దొంగిలించబడిన ఏడు నెలల చిన్నారిని స్వాధీనం చేసుకున్న కేసులో బీజేపీ కార్పొరేటర్, మరో ఏడుగురిని అరెస్టు చేసిన విషయాన్ని సిసోడియా ప్రస్తావించారు.

సిసోడియా నిజాయతీ దేశం ముందు నిరూపితమయింది : కేజ్రీవాల్

మనీశ్ సిసోడియా నిజాయతీ, దేశభక్తి యావత్ దేశం ముందు నిరూపితమైందని దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ మంగళవారం అన్నారు. ఉప ముఖ్యమంత్రి బ్యాంకు లాకర్‌లో సీబీఐ సోదాల అనంతరం సీఎం ఈ వ్యాఖ్యలు చేశారు. 'మురికి రాజకీయాల' వల్లే ఈ చర్య జరిగిందని కేజ్రీవాల్ ఆరోపించారు. 'మనీశ్ ఇంటి నుంచి, ఆయన లాకర్ నుంచి ఏమీ కనుగొనలేదు. సీబీఐ సోదాల్లో ఏమీ దొరకలేదు. మనీశ్‌లోని నిజాయతీ, దేశభక్తి యావత్ దేశం ముందు నిరూపితమయ్యాయి. చర్య మొత్తం మురికి రాజకీయాల వల్లే జరిగిందని స్పష్టమవుతోంది. ఈ చెత్త రాజకీయాలకు స్వస్తి పలికి, పని చేసేందుకు అనుమతిస్తారని ఆశిస్తున్నా' అని సిసోడియా విలేకరులతో మాట్లాడిన టీవీ వార్తా దృశ్యాన్ని పంచుకుంటూ కేజ్రీవాల్ హిందీలో ట్వీట్ చేశారు.

ఏపీలో పెట్టుబడులపై ఆసక్తి

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యతనిస్తూ, జాతీయ, అంతర్జాతీయ క్రీడలలో పతకాలు సాధించిన క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల జరిగిన కామన్వెల్త్ గేమ్స్ ఫెన్సింగ్ చాంపియన్‌షిప్ (జూనియర్స్ టీమ్)లో కాంస్య పతకం గెలిచిన అన్నమయ్య జిల్లా చెన్నముక్కపల్లెకు చెందిన బేబి రెడ్డి టీమ్ తాను జాతీయ స్థాయిలో టీమ్ పరంగా, వ్యక్తిగతంగా సాధించిన పతకాలను చూపారు. ఇటీవల దిల్లీలో జరిగిన పారా ఏషియన్ ట్రాక్ సైక్లింగ్‌లో వెండి, కాంస్య పతకాలు సాధించిన షేక్ అర్షద్ తాను జాతీయ స్థాయిలో సాధించిన పతకాలను కూడా సీఎంకి చూపించారు. అక్టోబర్‌లో ఫ్రాన్స్‌లో జరగనున్న ట్రాక్ వరల్డ్ కప్‌లో పాల్గొంటున్నట్లు అర్షద్ వివరించారు. తమకు ప్రభుత్వం నుంచి సహకారం ఇవ్వాలని సీఎంని వారిద్దరు కోరారు. సీఎంను వీరితో పాటు బేబి రెడ్డి తండ్రి రామకృష్ణారెడ్డి, కుటుంబ సభ్యులు శ్రీనివాసులు రెడ్డి, వెంకట్రామి రెడ్డి, అర్షద్ కోచ్ ఆదిత్య మెహతా ఉన్నారు.

గణేశ్ ఉత్సవాలు వద్దు

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వ ఆధ్వర్యంలో ఆలయం ఉంటుంది' అని చెప్పారు. ఇందుకు స్పందనగా బాబ్రీ మసీదు వ్యవహారాన్ని వక్ఫ్ బోర్డు న్యాయవాది గుర్తుచేశారు. 'నాటి యూపీ సీఎం బాబ్రీ మసీదు విషయంలోనూ ఇటువంటి హామీనే ఇచ్చారు. కానీ తర్వాత ఏమి జరిగిందో అందరికీ తెలుసు' అని 1992లో మసీదు విధ్వంసాన్ని ఉద్దేశించి అన్నారు. ప్రస్తుతం ఆ స్థలంలో రామ మందిర నిర్మాణం జరుగుతున్న విషయం విదితమే. కర్ణాటక వక్ఫ్ బోర్డుకు చెందిన ఈద్గా మైదానంలో గతంలో ఇటువంటి కార్యక్ర మాలను నిర్వహించారా అని సుప్రీం కోర్టు ప్రశ్నిం చగా ప్రభుత్వ న్యాయ వాది ముకుల్ రోహత్గీ స్పందిస్తూ 'అప్పటి పరిస్థితులకు.. ఇప్పుడు పండగ నిర్వహణకు ముడి పెట్టడం ఏమిటి అని ప్రశ్నిం చారు. 200 ఏళ్లుగా ఈ స్థలాన్ని పిల్లల ఆట మైదానంగా వాడుతున్నారని, రెవెన్యూ పత్రాలన్నీ రాష్ట్ర ప్రభుత్వం పేరిట ఉన్నాయని చెప్పారు. దిల్లీలో దసరా సందర్భంగా దిష్టిబొమ్మల దహనాన్ని అన్ని చోట్ల నిర్వహిస్తారని, ఇది హిందువుల పండగ.. నిర్వహించవద్దు అని ప్రజలు అంటారా? మనం కాస్త విశాల దృక్పథంతో ఉండాలి. గుజరాత్‌లో వీధులన్నీ పండుగ కోసం మూసివేస్తారు. రెండు రోజుల కోసం గణేశ్ చతుర్థి నిర్వహణకు అనుమతి ఇస్తే ఏమవు తుంది? అని వాదించారు. దవే స్పందిస్తూ 'మైనారిటీలు తమ ప్రార్థనలను నిర్వహించేందుకు అనుమతి నిచ్చే ఏదైన ఆలయం మన దేశంలో ఉందంటారా!' అని వ్యాఖ్యానించారు. వక్ఫ్ చట్టం 1995 ప్రకారం ప్రభుత్వ సంస్థలు స్వాధీనం చేసుకున్న వక్ఫ్ ఆస్తులను వక్ఫ్‌బోర్డుకు తిరిగి ఇచ్చేయాలని అన్నారు. ఈ భూమి రాష్ట్ర ప్రభుత్వ అధికార పరిధిలోకి రాదన్నారు. వచ్చే ఏడాది ఎన్నికలు జరగనున్న దృష్ట్యా ముస్లింల స్థలంలో హిందూ పండగ నిర్వహించే ప్రయత్నం జరుగుతోందని రాష్ట్ర ప్రభుత్వ రాజకీయ ఉద్దేశాలపై వక్ఫ్‌బోర్డు అనుమానం వ్యక్తంచేసింది. 2023లో బృహత్ బెంగళూరు మహా నగర పాలికే (బీబీఎంపీ) ఎన్నికలు జరగనున్నాయి. బోర్డు తరపు న్యాయవాదుల్లో కపిల్ సిబల్ ఉన్నారు. ఇక్కడ ఏం జరుగుతోంది. దీనిని మీరు ఆపాలి అని కోర్టును ఆయన కోరారు. ఈ వ్యవహారాన్ని ఎల్లుండి విచారించవచ్చు అని కర్ణాటక ప్రభుత్వం చేసిన సూచనను న్యాయస్థానం తోసిపుచ్చింది.

అక్టోబరులో సీపీసీ ఏడవ ప్లీనరీ

బీజింగ్ : 19వ సీపీసీ సెంట్రల్ కమిటీ, 20వ సీపీసీ నేషనల్ సెషన్ ఏడవ ప్లీనరీ సమావేశాలు బీజింగ్‌లో అక్టోబరు 9న నిర్వహించేందుకు రంగం సిద్ధమైంది. ఈ నేపధ్యంలో కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ చైనా (సిపిసి) సెంట్రల్ కమిటీ పొలిటికల్ బ్యూరో జరిపిన సమావేశానికి సీపీసీ సెంట్రల్ కమిటీ ప్రధాన కార్యదర్శి జి జిన్‌పింగ్ అధ్యక్షత వహించారు. 19వ సీపీసీ సెంట్రల్ కమిటీ ఏడవ ప్లీనరీ సమావేశాన్ని బీజింగ్‌లో అక్టోబర్ 9న నిర్వహించాలని సమావేశం నిర్ణయించింది. 20వ సీపీసీ జాతీయ మహాసభలు కీలకమైన తరుణంలో నిర్వహించాల్సిన గొప్ప ప్రాముఖ్యత కలిగిన మహాసభగా పేర్కొన్నారు. చైనా ఆధునిక సోషలిస్టు దేశంగా నిర్మించే దిశగా ఈ సమావేశాలు జరుగనున్నాయి. చైనా లక్షణాలతో కూడిన సోషలిజం ప్రధాన ప్రాతిపదికగా ఈ సమావేశం ప్రాధాన్యతను సంతరించుకోనుంది. మార్క్సిజం-లెనినిజం, మావో జెడాంగ్ ఆలోచన, డెంగ్ జియావో పింగ్ సిద్ధాంతం, చైనా లక్షణాలతోకూడిన సోషలిజం లక్ష్యంగా జిన్‌పింగ్ ఈ సమావేశాన్ని నిర్వహిస్తారు. ఐదేళ్లలో పార్టీ చేసిన పనిని, పార్టీ సెంట్రల్ కమిటీ ప్రధాన విజయాలు, విలువైన అనుభవాలను పరిగణనలోకి తీసుకుంటుంది. ఈ సమావేశం అంతర్జాతీయ, దేశీయ పరిస్థితులను క్షుణ్ణంగా సమీక్షిస్తుంది, పార్టీ, దేశం అభివృద్ధి కోసం కొత్త అవసరాలు, అలాగే ప్రజల అంచనాలను సమగ్రంగా గ్రహిస్తుంది.కాంగ్రెస్ కార్యాచరణ ప్రణాళికలు, ప్రధాన విధానాలను రూపొందిస్తుంది, చరిత్రపై విశ్వాసాన్ని దృఢపరచడానికి, చారిత్రక చొరవను పటిష్టం చేయడానికి, చేసిన వాటి ఆధారంగా ఆవిష్కరణలు చేయడానిక, ధైర్యంగా ముందుకు సాగడానికి దేశవ్యాప్తంగా పార్టీ సభ్యులందరినీ, అన్ని జాతుల ప్రజలను సమీకరించనుంది.

ఇరాక్ సైన్యం కాల్పుల్లో 23 మంది మృతి

బాగ్దాద్: ఇరాక్‌లో రాజకీయ సంక్షోభం ఏర్పడింది. ఇరాక్‌లోని శక్తివంతమైన నాయకుల్లో ఒకరైన షియా మతాధికారి ముక్తాదా అల్-సదర్ రాజకీయాలకు విరమణ ప్రకటించడంతో దేశంలో హింస చెలరేగింది. ఆయన మద్దతుదారులు ప్రభుత్వ భవనాన్ని ముట్టడించారు. ఈ నేపథ్యంలో రాజధానిలో భారీ ప్రదర్శనలు జరిగాయి. మరో వైపు అల్లర్లు చెలరేగాయి. బాగ్దాగ్ గ్రీన్‌జోన్‌లో ఆందోళనకారులపై సైన్యం జరిపిన కాల్పుల్లో 23 మంది మృతి చెందారు. దాదాపు వంద మందికిపై గాయపడ్డారు. షియా మతాధికారికి మద్దతుగా నెలకొన్న నిరసనల్లో ఇరాక్ సైన్యం దేశవ్యాప్తంగా కర్ఫ్యూ ప్రకటించింది. ఇరాక్‌లో కీలకమైన షియా మతాధికారి ముక్తాదా అల్ సదర్ సోమవారం రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్లు ట్విట్టర్ ద్వారా ప్రకటించారు. తన పార్టీ కార్యాలయాలను సైతం మూసివేస్తున్నట్లు పేర్కొన్నారు. దీంతో ఆయన మద్దతుదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆందోళనలకు దిగారు. ప్యాలెస్ గేట్లను పగులగొట్టారు. బాగ్దాద్‌లో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఇరాకీ సైన్యం కర్ఫ్యూను ప్రకటించింది. షియా మతాధికారి మద్దతుదారులను రాజభవనానికి దూరంగా ఉండాలని, విధ్వంసాన్ని ఆపాలని సైన్యం కోరింది. అయితే, అల్ సదర్ రాజకీయాలకు విరమణ ప్రకటించడం ఇదే మొదటిసారి కాదు. ఇంతకు ముందు ఇలానే చాలా సార్లు ప్రకటించారు.

టర్కీ ఎన్నికల్లో కమ్యూనిస్టు, లెఫ్ట్ పార్టీల కూటమి పోటీ

టర్కీ: టర్కీలో కమ్యూనిస్ట్, లెఫ్ట్ పార్టీలు కలిసి "యూనియన్ ఆఫ్ సోషలిస్ట్ ఫోర్సెస్"గా ఏర్పడ్డాయి. 18 జూన్ 2023న జరగనున్న సార్వత్రిక ఎన్నికలలో టర్కీలో "యూనియన్ ఆఫ్ సోషలిస్ట్ ఫోర్సెస్" పేరుతో ఎన్నికల కూటమి ఏర్పడింది. "మన దేశ భవిష్యత్తును కాపాడుకుందాం" అనే నినాదంతో అంకారాలో జరిగిన విలేకరుల సమావేశంలో ఎన్నికల కూటమి ప్రకటించింది. ఈ ఎన్నికల్లో కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ టర్కీ (టీకేపీ), లెఫ్ట్ పార్టీ (ఎస్ఓఎల్), కమ్యూనిస్ట్ మూవ్‌మెంట్ ఆఫ్ టర్కీ (టీకేహెచ్), రివల్యూషన్ మూవ్‌మెంట్ ఉన్నాయి.

కూటమి ఏర్పాటుతో పాటు ట్రేడ్ యూనియన్ వాదులు, రచయితలు, జర్నలిస్టులు, న్యాయవాదులు, మేధావులు, కళాకారులు, ఇతరులు సహా 226 మంది ప్రముఖులు సంతకం చేసి తమ మద్దతు ప్రకటించారు. "టర్కీ ఉజ్వల భవిష్యత్తు, దోపిడీకి వ్యతిరేకంగా సమానత్వం, ప్రతిచర్యకు వ్యతిరేకంగా లౌకికవాదం, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా స్వాతంత్ర్యం, పెట్టుబడిదారీ వ్యతిరేకత, సామాజిక సమానత్వం, నాటో వ్యతిరేక విధానం, ప్రజా యాజమాన్యం, లౌకికవాదంపై దృష్టి సారించే ఐదు పాయింట్ల పోరాట ఎజెండాగా ఏర్పాటు చేస్తూ నాలుగు పార్టీలు ప్రకటించాయి.

లిబియా ఘర్షణల్లో 32 మంది మృతి

ట్రిపోలి : లిబియాలో ప్రత్యర్థి, ప్రభుత్వాల మద్దతుదారుల మధ్య జరిగిన ఘర్షణల్లో 32మంది మరణించారు. ఈ ఘర్షణలు ప్రమాదకరమైన స్థాయిలో కొత్త ఘర్షణలకు దారి తీయొచ్చనే భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. రెండు రోజులుగా భీకర ఘర్షణలతో అట్టుడుకిన రాజధాని ట్రిపోలి ఆ హింస నుంచి మెల్లగా కోలుకుంటోంది. 2020లో కాల్పుల విరమణ తర్వాత దేశ రాజధానిలో జరిగిన అతిపెద్ద ఘర్షణలు ఇవే. ఈ ఘర్షణల్లో మొత్తంగా 32మంది మరణించగా, 159మంది గాయపడ్డారని ఆదివారం ఉదయం ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రకటించింది. ట్రిపోలిపై పట్టు కోసం రెండు వైరి గ్రూపులు ప్రయత్నిస్తున్నాయి. గతేడాది ఐక్యరాజ్య సమితి నేతృత్వంలోని శాంతి క్రమంలో భాగంగా దెబా ప్రభుత్వం ఏర్పడింది. నాటో మద్దతుతో జరిగిన తిరుగుబాటులో 2011లో మహ్మద్ గడాఫిని గద్దె దింపి హత్య చేయడంతో లిబియాలో సంక్షోభం మొదలైంది.

విపక్ష ఐక్యతకు ఇదే స్ఫూర్తి

(మొదటిపేజీ తరువాయి)

దాఖలాలు లేవు. తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన ముకుల్ రాయ్, కాంగ్రెస్‌కు చెందిన హేమంత్ బిశ్వాస్ శర్మ వంటి నేతలపై కేసులు... వారు బీజేపీ గూటికి చేరిన తర్వాత మసకబారిపోయాయి. బీజేపీ 'ఆపరేషన్ కమలం'లో భాగంగా కేంద్ర సంస్థల దుర్వినియోగం, అన్ని రాష్ట్రాల్లో అధికార వాంఛ తేటతెల్లంమైంది. 'భయపడే వాడిని ఇంకా భయపెట్టాలి.. అమ్ముడుపోయే వాడిని కొనేయాలి' అన్నది కమలం పార్టీ విధానమని లాలూ తనయుడు, బీహార్ ఉప ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్ వ్యాఖ్యానించారు. ఈ మధ్యనే మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఆపరేషన్ కమలం ద్వారా బీజేపీ కూల్చింది. అంతకుముందు కర్ణాటక, మహారాష్ట్ర గోవా, అసోంలలోనూ ఇదే చేసింది. ఆపరేషన్ కమలాన్ని తట్టుకొని నిలబడగలిగినవి దిల్లీ, బీహార్ మాత్రమే. భవిష్యత్‌లోనూ ఆ శక్తి బీహార్‌కే ఉండవచ్చు. మహాకూటమిలో నితీశ్‌కుమార్‌కు చెందిన జేడీయూ, లాలూ ప్రసాద్ యాదవ్‌కు చెందిన ఆర్జేడీ, జితన్ రామ్ మాంఝీ పార్టీ హిందుస్థానీ అవామ్ మోర్చా (సెక్యులర్), కాంగ్రెస్, సోషలిస్టు, కమ్యూనిస్టు పార్టీలతో కలిపి మొత్తం ఏడు రాజకీయ పార్టీలు ఉన్నాయి.

'ఆపరేషన్ ఫ్లాప్'

తమ రాష్ట్రంలో కమల దళం ఆపరేషన్ ఫ్లాప్ అయిందని మహాకూటమి ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. మహారాష్ట్రలో ఏక్‌నాథ్ షిండే చేసిన పనిని బీహార్‌లో ఆర్‌సీపీ సింగ్ చేయాలన్న వ్యూహాలు బెడిసికొట్టాయని పేర్కొన్నాయి. సింగ్ కేంద్ర మాజీ మంత్రి, ఒకప్పుడు నితీశ్ కుమార్‌కు నమ్మకస్తుడు. ఆయన ద్వారా అధికార పక్షాన్ని చీల్చేయాలని బీజేపీ కుట్ర చేసింది. 19 మంది సభ్యుల కాంగ్రెస్‌ను విభజించి హిందుస్తానీ అవామ్ మోర్చా(సెక్యులర్)కు చెందిన నలుగురు ఎమ్మెల్యేలను 77 మంది బీజేపీ ఎమ్మెల్యేలతో కలిపివేయాలని కమల దళం భావించింది. అది జరిగాక ఎన్డీయే నేతృత్వ (బీజేపీ-జేడీ(యూ)) సంకీర్ణ ప్రభుత్వాన్ని కూల్చివేయాలని యోచించింది. కేంద్ర దర్యాప్తు సంస్థలను వినియోగించి లాలూ, తేజస్వీతో పాటు వారి కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులను భూమి-ఉద్యోగం కుంభకోణంలో ఇరికించాలని ప్రణాళికలు వేసుకుంది. ఉత్తరప్రదేశ్‌లో మాయావతి, పశ్చిమ బెంగాల్‌లో టీఎంసీ నేత ముకుల్ రాయ్, అసోంలో హేమంత్ బిశ్వాస్ శర్మల నోళ్లను సీబీఐ, ఈడీ, ఐటీ దాడులతో మూయించినట్లుగా బీహార్‌లో చేయలేకపోయింది.

ఆపరేషన్ కమలాన్ని నితీశ్, తేజస్వీ తిప్పికొట్టడమే కాకుండా ఎదురుదాడికి దిగారు. తండ్రికి తగ్గ తనయుడిగా తేజస్వీ యాదవ్...బీజేపీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. 'బీజేపీకి ముగ్గురు అల్లుళ్లు-సీబీఐ, ఈడీ, ఐటీ శాఖ'. తమ అల్లుళ్లను ప్రత్యర్థుల ఇళ్లకు ఆ పార్టీ పంపుతుంది'అని విమర్శించారు. నితీశ్ కుమార్ కూడా ఘటుగా స్పందించారు. బీజేపీ చేసేదల్లా అనుకూల మీడియా ద్వారా ప్రచారం చేయించుకోవడం తప్ప మరేమీ లేదని ఎద్దేవా చేశారు. ప్రతి ఇంటికి విద్యుత్, నల్లా నీరు అందించే తమ నమూనాను దోచుకుని ప్రచారం చేయించుకున్నట్లు దుయ్యబట్టారు. ఏదిఏమైనా తాజా పరిణామాల దృష్ట్యా మోదీ ప్రభుత్వ వ్యతిరేక పోరునకు విపక్షాల ఐక్యతకు బీహార్ స్ఫూర్తిగా నిలుస్తుందన్న అంచనాలు ఉన్నాయి.

ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్ బోర్డు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను ఇంటర్ బోర్డు కార్యదర్శి ఎంవీ శేషగిరిబాబు విడుదల చేశారు. తాడేపల్లి ఇంటర్మీడియట్ విద్యామండలి కార్యాలయంలో మంగళవారం సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలను ఆయన ప్రకటించారు. పున: పరిశీలన, పున: లెక్కింపు కోసం దరఖాస్తులను సెప్టెంబర్ 10వ తేదీ వరకు స్వీకరిస్తారు. సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించిన మార్కుల మెమోలు అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరుస్తారు. ఇంటర్ ప్రథమ ఫలితాల్లో జనరల్‌లో 35 శాతం, వృత్తివిద్యలో 42 శాతం ఉత్తీర్ణత సాధించారు.

ద్వితీయ సంవత్సర జనరల్‌లో 33 శాతం, ఒకేషనల్ 46 శాతం ఉత్తీర్ణత సాధించారు. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ-2022 పరీక్షలను ఆగస్టు 3 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించగా, 13 నుంచి 26 తేదీ వరకు మూల్యాంకనం చేశారు. ఈ పరీక్షలకు జనరల్-3,28,831 మంది, వృత్తివిద్య-37,712 మంది మొత్తం 3,66,543 మంది హాజరయ్యారు. జనరల్ ప్రథమ సంవత్సర విద్యార్థులు 1,76,942 మంది హాజరుకాగా, 61,410 మంది ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరానికి 1,51,889 మంది పరీక్షలకు హాజరుకాగా, 50,691 మంది ఉత్తీర్ణత సాధించారు. వృత్తి విద్యా కోర్సుల్లో ప్రథమ సంవత్సర విద్యార్థులు 18,399 మంది హాజరుకాగా 7,680 మంది ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరానికి 19,313 మంది హాజరుకాగా 8,924 మంది ఉత్తీర్ణత సాధించారు. ప్రథమ సంవత్సర మార్కుల పెంపు పరీక్ష కోసం 1,47,164 మంది విద్యార్థులు హాజరుకాగా, వారిలో 1,28,573 మంది మెరుగైన ఫలితాలను సాధించారు. ఇంటర్ మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాల సమాచారం www.bie.ap.gov.in, http://examresults.ap.nic.in వెబ్‌సైట్ల నుంచి పొందవచ్చని శేషగిరిబాబు తెలిపారు. ఈ సమావేశంలో ఇంటర్ బోర్డు అధికారులు ప్రభాకరరెడ్డి, గౌడ్, సుశీల తదితరులు పాల్గొన్నారు.

కృష్ణకు మళ్లీ వరద

(మొదటిపేజీ తరువాయి)

పులిచింతలలో 169.19 అడుగుల్లో 37.23 టీఎంసీలు నిల్వ ఉండగా, ఎగువ నీటి ప్రవాహానికనుగుణంగా నీటి విడుదలకు చర్యలు తీసుకుంటున్నారు. ప్రకాశం బ్యారేజీకి 2,31,063 క్యూసెక్కుల వరద వస్తుండగా, కృష్ణా డెల్టాకు 14,962 క్యూసెక్కులను విడుదల చేస్తూ మిగిలిన వరద నీటిని ప్రాజెక్టు 70 గేట్లు ఎత్తి సముద్రంలోకి వదిలేస్తున్నారు. కృష్ణా బేసిన్‌లో మళ్లీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించడంతో రాబోయే రెండు రోజులు వరద పెరిగే ప్రమాదముందని, తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు తెలిపారు.



ఆగని అరెస్టులు... బెదిరింపులు

(మొదటిపేజీ తరువాయి)

పవిత్రంగా భావించే వినాయక చవితి పండుగ ఉందని, అవసరమైతే సెప్టెంబర్ 1న వస్తామని విజ్ఞప్తి చేసినా పోలీసులు మొండిగా వ్యవహరిస్తున్నారు. వివిధ జిల్లాల్లో ఉపాధ్యాయుల వ్యక్తిగత ద్విచక్ర వాహనాలు, కార్లను సీజ్ చేసి, నిర్బంధాల పర్వం కొనసాగిస్తున్నారు. వారం రోజుల నుంచి ఉపాధ్యాయులను సమీప స్టేషన్లకు పిలిపించుకుని వారికి నోటీసులు జారీజేశారు. పోలీసులు ఎన్ని ఇబ్బందులు, నిర్బంధాలు పెట్టినప్పటికీ, సీపీఎస్ రద్దు చేసేంత వరకు తమ పోరాటం ఆగబోదని ఉద్యోగ సంఘాల నేతలు తేల్చిచెబుతున్నారు. ఉపాధ్యాయుల పై బైండోవర్ కేసులు పెట్టడంపై ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీలు మండిపడ్డారు. పోలీసుల చర్యలను ఖండిస్తూ, రాష్ట్ర డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డికి ఎమ్మెల్సీలు కత్తి నరసింహారెడ్డి, కేఎస్ లక్ష్మణరావు, విఠపు బాలసుబ్రహ్మణ్యం బృందం వినతిపత్రం అందజేసింది. తక్షణమే ఉపాధ్యాయుల అరెస్టులు, నిర్బంధాలను ఆపాలంటూ డిమాండ్ చేసింది. సాధారణ ఉపాధ్యాయులను పోలీస్ స్టేషన్‌లకు పిలిపించి వేధించటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము సీపీఎస్ రద్దు కోసం నిలబడి తీరుతామని స్పష్టం చేశారు. ఉద్యోగుల పై బెదిరింపులు, వేధింపులు ఆపాలని, అరెస్టు చేసిన వారిని తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీర్ శర్మకు టీడీపీ అధినేత చంద్రబాబు లేఖ రాశారు. పోలీసుల చర్యలను ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.సాయిశ్రీనివాస్, హెచ్.తిమ్మన్న తీవ్రంగా ఖండించారు. సీపీఎస్ రద్దు కోసం సెప్టెంబరు 1న రాష్ట్ర వ్యాప్తంగా నల్ల ఫ్లెక్సీలు, నల్ల బ్యాడ్జీలు, నల్ల దుస్తులతో నిరసనకు దిగాలని ఎస్టీయూ పిలుపునిచ్చింది. కాగా ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల అరెస్టులను కార్మిక సంఘాల ఐక్య వేదిక నేతలు తీవ్రంగా ఖండించారు.

వాయిదా వేసినా... అరెస్టులు బాధాకరం: ఏపీ సీపీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్

రాష్ట్రంలో శాంతిభద్రత రీత్యా చలో విజయవాడను వాయిదా వేసుకున్నప్పటికీ, సీపీఎస్ ఉద్యోగులను ఇంకా అరెస్టులు చేయడాన్ని ఏపీ సీపీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు అప్పలరాజు ఖండించారు. చలో విజయవాడను వాయిదా వేసుకున్నట్లు ఈనెల 29వ తేదీన తాము ప్రకటించామని గుర్తుచేశారు. పోలీసుల అనుమతి లేకుండా చలో విజయవాడ నిర్వహించబోమని డీజీపీకి హామీ ఇస్తున్నామన్నారు. పోలీసులు తీసుకెళ్లిన సీపీఎస్ ఉద్యోగులను తక్షణమే విడుదల చేయాలని కోరారు. ఉద్యోగులపై ఎక్కడికక్కడే బైండోవర్లు చేసి పోలీసు స్టేషన్లకు తీసుకెళ్లడాన్ని విడనాడాలన్నారు. ప్రతి ఏటా సెప్టెంబరు 1న చీకటి దినగా సీపీఎస్ ఉద్యోగులు నిర్వహించుకుంటారని వివరించారు.

ఉద్యోగులపై వేధింపులు ఆపాలి: చంద్రబాబు

సీపీఎస్ ఉద్యోగుల పై వేధింపులు, కేసులు ఆపాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీర్ శర్మకి టీడీపీ అధినేత చంద్రబాబు లేఖ రాశారు. ఉద్యోగుల పై బైండోవర్ కేసులు, వేధింపులు నిలిపివేయాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) రద్దు చేసి, పాత పెన్షన్ స్కీమ్ (ఓపీఎస్) తిరిగి ప్రారంభిస్తానని సీఎం జగన్ ఎన్నికల ప్రచారంలో వాగ్దానమిచ్చారని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చిన వారంలో సీపీఎస్ రద్దు చేస్తానని జగన్ ప్రకటించారని, ప్రభుత్వం వచ్చి మూడేళ్లు గడిచినా హామీ నెరవేరలేదన్నారు. అందుకే ఉద్యోగులు నిరసనల బాట పట్టారని, శాంతియుత నిరసనలు ఉద్యోగులకు రాజ్యాంగం ఇచ్చిన హక్కు అని పేర్కొన్నారు. సీఎం ఇచ్చిన వాగ్దానం నెరవేర్చని కారణంగానే ఉద్యోగులు నిరసనల బాట పట్టాల్సి వచ్చిందన్నారు. శాంతియుత నిరసనలకు పిలుపునిచ్చిన ఉద్యోగుల పై పోలీసులను ప్రభుత్వం ఉపయోగించి బైండోవర్ కేసులు, నోటీసులు, పోలీస్ స్టేషన్‌కు పిలిపించడం తదితర రకరకాల చర్యలతో వారిని వేధింపులకు గురి చేసిందన్నారు. ఉద్యోగులు తమ శాంతియుత నిరసనను సెప్టెంబర్ 1 నుంచి సెప్టెంబర్ 11వ తేదీకి వాయిదా వేసినప్పటికీ పోలీసుల బెదిరింపులు, వేధింపులు కొనసాగడాన్ని ఖండించారు.

ఉపాధ్యాయుల అరెస్టులు ఆపండి

డీజీపీకి ఎమ్మెల్సీల బృందం వినతి



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) రద్దు కోరుతూ ఉద్యమిస్తున్న ఉపాధ్యాయులపై అరెస్టులు, నిర్బంధాలు ఆపాలని ఎమ్మెల్సీల బృందం డిమాండ్ చేసింది. మంగళగిరి కార్యాలయంలో డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డికి ఎమ్మెల్సీలు కత్తి నరసింహారెడ్డి, కేఎస్ లక్ష్మణరావు, విఠపు బాలసుబ్రహ్మణ్యం బృందం మంగళవారం వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీలు మాట్లాడుతూ, సీపీఎస్ రద్దు కోరుతూ సెప్టెంబరు 1న వివిధ ఉద్యోగ సంఘాలు చలో విజయవాడకు పిలుపునిచ్చాయని, దానిని పురస్కరించుకుని నాలుగు రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు, సంఘాల సభ్యులకు పోలీసులు నోటీసులు ఇవ్వడం, బైండోవర్ కేసులు పెడుతున్నారని పేర్కొన్నారు. ఉపాధ్యాయులపై నిర్బంధం ఎక్కువగా ఉందన్నారు. 29న అరెస్టు చేసి పోలీసుస్టేషన్లలో ఉంచారని వివరించారు. 'చలో విజయవాడ' పిలుపునిచ్చిన సంఘాలు తమ కార్యక్రమాన్ని వాయిదా వేసుకున్నట్లు ప్రకటించినప్పటికీ, ఉపాధ్యాయులను విడుదల చేయకపోవడం దుర్మార్గమన్నారు. వినాయక చవితి పండుగ రోజు సైతం పోలీస్‌స్టేషన్లలోనే మగ్గే పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తంచేశారు. ఉపాధ్యాయులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని, అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

అనంతబాబుకు బెయిల్ నిరాకరణ

విశాలాంధ్ర-అమరావతి: ఎమ్మెల్సీ అనంతబాబుకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వేసిన మూడో పిటిషన్‌ను ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయమూర్తి ఎం. నాగేశ్వరరావు కొట్టివేస్తూ మంగళవాం తీర్పు చెప్పారు. నిందితుడి బెయిల్ పిటిషన్‌ను కొట్టివేయాలని కోరుతూ ప్రముఖ న్యాయవాది, ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముప్పాళ్ల సుబ్బారావు బాధితుల తరపున వాదించారు. పలుకుబడి, అధికార పార్టీకి చెందిన వ్యక్తి కాబట్టి సాక్షులను ప్రభావితం చేయవచ్చన్న ముప్పాళ్ల వాదనలతో న్యాయస్థానం ఏకీభవించింది. చార్జిషీట్ దాఖలు చేసినంత మాత్రాన నిందితులను విడుదల చేయవలసిన అవసరం లేదని సుప్రీంకోర్టు తీర్పును ఈ సందర్భంగా న్యాయస్థానం దృష్టికి తీసుకువచ్చారు.

కర్ణాటకలో సీఎం పోస్ట్‌కు రూ.2,500 కోట్లట!

బీజేపీ నేత నడ్డాకు ట్విట్టర్‌లో కేటీఆర్ చురకలు

విశాలాంధ్ర-హైదరాబాద్: బీజేపీ పాలిత కర్ణాటక రాష్ట్రంలో జరుగుతున్న అవినీతిపై కపటంగా వ్యవహరించవద్దని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాకు తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కే తారకరామారావు చురకలేశారు. నడ్డా ... 'మీ బీజేపీ పాలిత కర్ణాటకలో సీఎం కావడానికి రూ.2,500 కోట్లు ఇస్తానన్నారటగా, మరి మీ మిత్రపక్షాలు సీబీఐ, ఈడీ అప్పుడు ఎక్కడ ఉన్నాయి?' అని కేటీఆర్ ట్విట్టర్‌లో ప్రశ్నించారు. విద్యలో 40 శాతం, కాంట్రాక్టర్ల నుంచి 40 శాతం టూరిజంలో 40 శాతం మఠాలకు గ్రాంట్ల జారీలో 30 శాతం కమీషన్లు కర్ణాటక ప్రభుత్వానికి ఇచ్చామంటూ పలువురు చేసిన ప్రకటనలు, పలు పత్రికల్లో వచ్చిన కథనాలను కేటీఆర్ పోస్ట్ చేశారు. ప్రధాని మోదీ తెలంగాణకు మంజూరు చేసిన మెడికల్ కాలేజీలు సున్నా అని మరో ట్వీట్‌లో మంత్రి కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఇదే సమయంలో ముఖ్యమంత్రి కేసీఆర్ వైద్యవిద్యా రంగంలో చరిత్ర లిఖించారని తెలిపారు.

రాబోయేది టీడీపీ ప్రభుత్వమే: లోకేశ్

విశాలాంధ్ర- చిత్తూరు: ఆంధ్రప్రదేశ్‌లో రాబోయేది టీడీపీ ప్రభుత్వమేనని, చట్టాన్ని ఉల్లంఘిస్తున్న పోలీసులను వదిలిపెట్టేది లేదని ఆపార్టీ నేత నారా లోకేశ్ హెచ్చరించారు. కుప్పంఘటనలో స్థానిక సబ్‌జైలులో ఉన్న తమపార్టీ నాయకులను మంగళవారం ఆయన పరామర్శించారు. లోకేశ్ మాట్లాడుతూ, పోలీసులు వైసీపీ ఏజెంట్లుగా పని చేస్తున్నారని విమర్శించారు. జగన్ సీఎం అయ్యాక రాష్ట్ర వ్యాప్తంగా 2010 అన్న క్యాంటీన్‌లు మూసేవేశారని మండిపడ్డారు. తల్లి, సోదరికి అన్నం పెట్టని వ్యక్తి ప్రజలకు ఏవిధంగా సహాయం చేస్తారని ప్రశ్నించారు. పేదలకు భోజనం లేకుండా చేసిన వ్యక్తి జగన్ అన్నారు. మంగళగిరిలో అన్న క్యాంటిన్ ప్రారంభిస్తే 60మంది టీడీపీ కార్యకర్తలను అరెస్ట్ చేశారన్నారు. చంద్రబాబు పర్యటనలో అన్న క్యాంటిన్ ఏర్పాటు చేస్తే ధ్వంసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ మంత్రి అమర్‌నాథరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు పులివర్తి నాని, దొరబాబు, కాజూరుబాలాజి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్యాయం... అక్రమం

- కర్నూలు ప్రభుత్వ వైద్యశాలలో తొలగించిన కార్మికులకు ఉద్యోగాలివ్వాలి
- ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కర్నూలు ప్రభుత్వ వైద్యశాలలో 20 ఏళ్లుగా పొరుగుసేవల ప్రాతిపదికన పని చేస్తున్న 107 మంది కార్మికులను ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా అన్యాయంగా తొలగించడం బాధాకరమైన విషయమని, తక్షణమే వారిని విధుల్లోకి తీసుకోవాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం విజయవాడ ప్రభుత్వ వైద్యశాలలో ఏపీ మెడికల్ కాంట్రాక్టు ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మునెప్ప, పూదోట ప్రకాష్, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎం.రమేష్‌బాబుతో కలిసి రాష్ట్ర వైద్య విద్యా సంచాలకులు డాక్టర్ ఎం.రాఘవేంద్రరావు, అరుణదేవిని కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఓబులేసు మాట్లాడుతూ కర్నూలు సర్వజన ప్రభుత్వ వైద్యశాలలో 2002లో కలెక్టర్ అనుమతితో హెచ్‌డీఎస్ హాస్పిటల్ ద్వారా నియమించి, వివిధ విభాగాల్లో 20 ఏళ్లుగా పని చేస్తున్న 107 మంది అవుట్ సోర్సింగ్ కార్మికులను ఎలాంటి తప్పిదం లేకపోయినా తొలగిస్తున్నట్లుగా సూపరింటెండెంట్ సంబంధిత ఏజెన్సీలకు లేఖలు పంపడం వెనుక ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వారిని తొలగించడం ఏమిటని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన అప్కాస్‌లో గుర్తించకుండా వారి హక్కులకు భంగం కలిగించడం సూపరింటెండెంట్‌కు తగదన్నారు. ఈ విషయంపై 160 రోజులుగా కర్నూల్ హాస్పిటల్ ఎదుట ఆందోళన చేస్తున్నారని, కార్మికుల సమస్యలపై కర్నూలు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని గుర్తుచేశారు. దానిపై సబ్ కమిటీ వేసి విచారిస్తామని, వారికి న్యాయం చేయాలని రాష్ట్ర డీఎంఈకు నివేదిక ఇచ్చారన్నారు. ఈ ఉద్యోగాల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల ఇప్పటికే నాలుగు నెలలపాటు వేతనాలు లేకుండా కార్మికులు రిలే నిరాహార దీక్షలు చేస్తున్నారన్నారు. ఉద్యోగం చేసేందుకు సంబంధిత అధికారులు ఆదేశాలు జారీ చేయాలని, లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనకు సిద్ధమవుతామని హెచ్చరించారు.

కడపలో 4న స్కీమ్ వర్కర్ల రాష్ట్ర సదస్సు

ఏపీ స్కీమ్ వర్కర్స్ యూనియన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: స్కీం కార్మికులకు వేతనాలు పెంపుదల చేయని ప్రభుత్వ నిరంకుశ వైఖరిని నిరసిస్తూ తక్షణ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర స్థాయి సదస్సును సెప్టెంబరు 4న కడప నగరంలో నిర్వహిస్తున్నట్లు ఏపీ స్కీమ్ వర్కర్స్ యూనియన్ల రాష్ట్ర నాయకులు లలితమ్మ, రమేష్ బాబు, శాంతి, ధనలక్ష్మీ, సుభాషిణి, స్రవంతి, బాలకృష్ణ తెలిపారు. ఈ మేరకు మంగళవారం యూనియన్ నేతలు ఒక ప్రకటన విడుదల చేస్తూ, ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు పాల్గొంటారన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలలో మహిళా కార్మికులతో వెట్టి చాకిరి చేయించుకుంటూ వారికి వేతనాలు, పని భద్రత కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. తమ న్యాయమైన సమస్యలు పరిష్కారం చేయాలని శాంతియుతంగా విజయవాడ కేంద్రంగా ధర్నాకు పిలిపిస్తే కార్మికులు, మహిళలు అని చూడకుండా ఎక్కడికక్కడ అరెస్టులు, ఇళ్ల దగ్గర నిర్బంధాలతో పోలీసులు వ్యవహరిస్తున్నారన్నారు. కనీసం తమ హక్కుల గురించి ప్రశ్నించే అవకాశం ఈ ప్రభుత్వం కల్పించడం లేదన్నారు.

సీఎం జగన్ తన పాదయాత్రలో ఇచ్చిన హామీలనే అమలు చేయాలని తాము అడుగుతున్నామన్నారు. ఆశా, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన పథకం, ఆరోగ్య మిత్ర, స్కావెంజర్ల కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై చర్చించి భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ దిశగా ఈ వర్క్ షాప్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ సదస్సులో కార్మికవర్గం పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

సీపీఎస్ రద్దు చేయాలి: ఓబులేసు

ఉద్యోగవర్గాల ఆందోళనకు కార్మిక సంఘాల ఐక్యవేదిక సంపూర్ణ సంఘీభావం
ప్రభుత్వ నిర్బంధాలను ఖండించిన రాష్ట్ర నాయకులు

విశాలాంధ్ర, విజయవాడ (గాంధీనగర్): ఉద్యోగులకు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు తక్షణం సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి జి. ఓబులేసు డిమాండ్ చేశారు. గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఓపీఎస్ సాధనకోసం ఉద్యోగులు చేస్తున్న ఆందోళనకు కార్మిక సంఘాల ఐక్యవేదిక సంఘీభావం తెలుపుతుందన్నారు. ఉద్యోగ వర్గాలపై ప్రభుత్వ నిర్బంధాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు.వైసీపీని గెలిపిస్తే అధికారం చేపట్టిన వారంలో సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేస్తానని పాదయాత్ర సందర్భంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలకు ఇచ్చిన హామీని బుట్ట దాఖలు చేశారని కేంద్ర కార్మిక సంఘాల ఐక్య వేదిక నాయకులు విమర్శించారు. కమిటీలు, చర్చల పేరుతో మూడేళ్లుగా మోసం చేస్తూవచ్చిన జగన్ ఇప్పుడు జీపీఎస్ పేరుతో కొత్త డ్రామాలు చేస్తున్నారని ఆరోపించారు. ఉద్యోగుల ఛలో విజయవాడ పిలుపును భగ్నం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం తీవ్రమైన నిర్బంధ విధానాలను అవలంభిస్తున్నదని, ఒక ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోనే 16,000 మందికి గృహ నిర్బంధాన్ని విధిస్తూ బైండోవర్ నోటీసులు ఇచ్చిందంటే పరిస్థితి ఎంతదారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చునని నాయకులు అన్నారు. ఆందోళనలో పాల్గొనకుండా గురుపూజ పేరుతో వారం రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్ణయించి ఉద్యోగులను కట్టడి చేయాలని ప్రభుత్వం చూస్తున్నదని ఇది చాలా దారుణమని అన్నారు. ఇళ్లను చుట్టిముట్టి కట్టడి చేస్తున్నారని, సెలవులు పెట్టినా సహించబోమని భయపెడుతున్నారని ప్రభుత్వానికి ఇది తగదని హెచ్చరించారు. ఉద్యోగులపై నిర్బంధాన్ని విడనాడి సమస్యను సామరస్యంగా పరిష్కరించాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ఆందోళనలకు మద్దతుగా ప్రజాసంఘాలను కలుపుకుని సెప్టెంబర్ 8న ఎన్జీవో భవన్‌లో రాష్ట్ర సదస్సు నిర్వహిస్తామని ప్రకటించారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.ఉమామహేశ్వరరావు, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.పోలారి, హెచ్‌ఎంఎస్ నాయకుడు కె.పాములు, ఏఐసీసీటీయూ నాయకుడు ఉదయ్ కిరణ్, ఏఐయూటీయూసీ రాష్ట్ర కార్యదర్శి సుధీర్, ఏఐసీటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌కే. ఖాదర్ బాషా, ఇఫ్టూ నాయకుడు రామకృష్ణ, టీయూసీఐ రాష్ట్ర అధ్యక్షుడు ఎమ్.ప్రసాద్ పాల్గొన్నారు.

ఉర్దూ స్కూల్ అసిస్టెంట్ పోస్టులు మంజూరు చేయండి

విద్యాశాఖ ముఖ్యకార్యదర్శికి ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి వినతి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాల అసిస్టెంట్ (ఎస్‌ఏ) పోస్టుల మంజూరుకు చర్యలు తీసుకోవాలంటూ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, రూట వ్యవస్థాపకులు సయ్యద్ హిదాయతుల్లా విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుడితి రాజశేఖర్‌కు మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఉర్దూ బాల బాలికల అక్షరాస్యత శాతం తక్కువ ఉన్న ప్రాంతాలను గుర్తించి కేంద్ర ప్రభుత్వం 2017-18 విద్యా సంవత్సరంలో 220 ప్రాథమిక ఉర్దూ పాఠశాలలను ప్రాథమికోన్నత ఉర్దూ పాఠశాలలుగా ఉన్నతీకరించి ప్రతి పాఠశాలకు మూడు అదనపు తరగతి గదులతోపాటు మూడు పాఠశాల సహాయక పోస్టులను మంజూరు చేశారన్నారు. ఉన్నతీకరించిన 220 ప్రాథమికోన్నత ఉర్దూ పాఠశాలల్లో నేటివరకూ స్కూల్ అసిస్టెంట్ పోస్టులను మంజూరు చేయలేదన్నారు. ఉన్నతీకరించి ఐదేళ్లు పూర్తి అవుతున్నప్పటికీ పోస్టులు భర్తీ చేయని కారణంగా అరకొరగా ఉన్న ఎస్‌జీటీలపైనే అదనపు భారం పడి, విద్యార్థుల విద్యా ప్రమాణాలు అట్టడుగుస్థాయికి చేరుకుంటున్నాయని

వినతిపత్రంలో పేర్కొన్నారు. విద్యార్థుల బంగారు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని వెంటనే 660 పాఠశాల సహాయక పోస్టులను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. విద్యా ప్రమాణాలకు ఆటంకం కలుగకుండా తక్షణమే అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమించాలని కోరారు. ముఖ్యకార్యదర్శి సానుకూలంగా స్పందించినట్టు చెప్పారు.

సీనియర్లకే ఎంఈఓ, డీవైఈవో బాధ్యతలివ్వాలి

ఖాళీగా ఉన్న ఎంఈవో, డీవైఈవో పోస్టుల్లో సీనియర్ ప్రధానోపాధ్యాయులకే పూర్తి అదనపు బాధ్యతలు (ఎఫ్‌ఏసీ) ఇవ్వాలని ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. సచివాలయంలో విద్యాశాఖ ముఖ్యకార్యదర్శిని కలిసి... హైకోర్టులో ఉన్న సర్వీస్ రూల్స్ సమస్యపై తుది తీర్పు వచ్చే వరకు మండల, డివిజన్లలో పనిచేస్తున్న సీనియర్ ప్రధానోపాధ్యాయులకు వారు ఏ యాజమాన్యం పాఠశాలలకు చెందినప్పటికీ ఎంఈఓ, డిప్యూటీ ఈవో పోస్టుల పూర్తి అదనపు బాధ్యతలు ఇవ్వాలని కోరారు. నూతనంగా ప్రతిపాదించిన 660 ఎంఈవో పోస్టులు , 49 డీవైఈవో పోస్టులను కూడా మంజూరు చేసి సీనియార్టీ ప్రకారమే భర్తీ చేసే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

రేపు సీపీఎస్ రద్దుకోరుతూ నిరసనలు: ఎస్టీయూ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సీఎం జగన్ ఇచ్చిన సీపీఎస్ రద్దు హామీ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ, సెప్టెంబర్ 1న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండల/తాలూకా కేంద్రాలలో నల్లరంగు ఫ్లెక్సీలు, బ్యాడ్జీలు, వస్త్రాలతో నిరసనకు దిగాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సాయిశ్రీనివాస్, హెచ్.తిమ్మన్న మంగళ వారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. సీపీఎస్ రద్దుపై ఉద్యమానికి వెనక్కి తగ్గబోమని, పాఠశాల విధులకు ఒకటో తేదీ నల్ల బ్యాడ్జీలతో హాజరు కావాలన్నారు. సాయంత్రం 5 గంటలకు స్థానిక మండల/తాలూకా కేంద్రాలలో జనసందోహం ఉన్న చోట నిరసన తెలియజేయాలన్నారు. సీపీఎస్ రద్దు కోసం ఏడేళ్లుగా ఉద్యమిస్తున్నామని, ఇప్పటికే దిల్లీ లోని జంతర్ మంతర్ వద్ద కూడా నిరసన, ఆందోళన చేశామని గుర్తుచేశారు. సీపీఎస్ రద్దు చేసేంత వరకు తమ పోరాటం ఆగబోదని స్పష్టం చేశారు.

ప్రజలకు గవర్నర్, సీఎం చవితి శుభాకాంక్షలు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : వినాయక చవితి పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ఆంధ్రప్రదేశ్ గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ శుభాకాంక్షలు తెలియజేశారు. తమ ప్రయత్నాలలో అడ్డంకులు తొలగి, చేపట్టిన పనులు విజయవంతం కావాలని భక్తులు విఘ్నేశ్వరునికి ప్రార్థిస్తారన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలకు సీఎం జగన్ వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు. విఘ్నేశ్వరుడి అనుగ్రహంతో మంచి పనులకు విఘ్నాలు తొలగి పోయి ప్రజలందరికీ శుభాలు కలగాలని ఆకాంక్షించారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
జిల్లా కలెక్టరు వారి కార్యాలయం - కాకినాడ

Ref. L6/HS/29/2022 Dt. 30-8-2022

ఫారం (నమూనా) నెం.6 (ఎ)

(2013వ సంవత్సరము 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలలో నష్ట పరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టం సెక్షన్ 11(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియామవళి 2014లో రూల్ 19, సబ్ రూల్ (1) ననుసరించి)

ప్రాథమిక ప్రకటన

కాకినాడ జిల్లా, శంఖవరం మండలం, శంఖవరం గ్రామంలో ఈ దిగువ నుదహరించిన షెడ్యూలు దాఖలా భూములను ప్రజా ప్రయోజనమునకై అనగా శంఖవరం గ్రామము నుండి ఎంపికైన లబ్ధిదారులకు గృహ వసతి కల్పించుట కొరకు భూమి కావలెనని శ్రీ జిల్లా కలెక్టరు, కాకినాడ వారు భావించినందున, 2013వ సంవత్సరం 30వ చట్టం వలన భూసేకరణ పునరావాసం, పునఃస్థాపనలలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు, పారదర్శకత చట్టంలో సెక్షన్ 11(1) నిబంధననుసరించి ఇందుకు సంబంధిత యావన్మందికి ఇందుమూలముగా నోటీసు జారీ చేయడమైనది.

ప్రతిపాదిత భూమి య.7.20 సెంట్లు సర్వే నెం.113/1,2,3,4,5,6,159-4, 114-6 మరియు 160పై నిర్వాసితులైన కుటుంబములు ఏమియూలేవు.

పైన పేర్కొనిన చట్టంలో సెక్షన్ 12క్రింద ఇవ్వబడిన అధికారముల నుండి వినియోగించి ల్యాండు అక్విజిషన్ అధికారి మరియు రెవిన్యూ డివిజనల్ అధికారి, పెద్దాపురం వారికి, వారి సిబ్బందికి మరియు పనివారలకు ఆ భూములను భూసేకరణకై పై సెక్షన్ క్రింద ఇవ్వబడిన అధికారములను వినియోగించుటకు అధికారము ఇవ్వబడినది.

జాయింటు సెక్రటరీ టు గవర్నమెంటు & డైరెక్టరు (ఆర్ & ఆర్) & ఎక్స్ ఆఫీసియో, ఐ & సి.ఎ.డి. డిపార్టుమెంటు వారి లేఖ సంఖ్య 1499/సి.ఆర్.ఆర్/జె.డి.(సి&ఎమ్)/2014, తేది. 17-12-2014 నందు కొత్త భూసేకరణ చట్టం-2013 నందు సెక్షన్ 6(2) ప్రకారం వ్యవసాయ నీటి పారుదల ప్రాజెక్టుల కొరకు సామాజిక ప్రభావం మదింపు (ఎస్.ఐ.ఎ.) గతంలోనే చేసియున్నందున, సామాజిక ప్రభావం మదింపు (ఎస్.ఐ.ఎ.) ప్రస్తుత భూసేకరణ నందు వర్తించదు.

పై చట్టంలో సెక్షన్ 11(4)ననుసరించి, ఈ ప్రాథమిక ప్రకటన వెలువడిన తేదీ నుండి కలెక్టరు/భూసేకరణ అధికారి వారి ముందస్తు అనుమతి లేనిదే ఏ వ్యక్తి ప్రకటనలో తెలిపిన భూమిని ఏ విధమైన అమ్మివేయుట/కొనుట (క్రయ విక్రయములు) లేదా ఏ విధమైన లావాదేవీలు జరుపరాదని తెలియజేయడమైనది.

పై చట్టంలో సెక్షన్ 15ననుసరించి భూసేకరణపై ఏమైనా అభ్యంతరములు/ఆక్షేపణలు ఉన్నయెడల సంబంధించిన వ్యక్తి/వ్యక్తులు ఈ ప్రకటనలు ప్రచురించబడిన తేదీ నుండి 60(అరువది) దినములలోగా కలెక్టరు/భూసేకరణ అధికారి వారి ఎదుట అభ్యర్థనలు దాఖలు చేసుకొనవచ్చును.

షెడ్యూలు

మండలము : శంఖవరం గ్రామం : శంఖవరం

క్రమ సంఖ్య	సర్వే నెం. సబ్ డివిజన్ నెం.	పూర్తి విస్తీర్ణం	[illegible]	భూ స్వభావం	భూ యజమాని/ పట్టాదారుని పేరు లేదా అనుభవదారుని పేరు	దిక్కులు వివరములు: ఉత్తరం	తూర్పు	దక్షిణం	పడమర	భూమిపై వున్న భవనములు లేదా మొక్కలు లేదా ఇతరములు
1	2	3	4	5	6	7				8
1	113/1	2.12	2.12	జిరాయితి నంజ	1. చందక రాజవరహాలు తండ్రి చక్రరావు 2. చందక చక్రరావు తండ్రి అప్పారావు	సర్వే నెం. 114-4,5బి	ఇండ్లు	కాలువ	సర్వే నెం. 159-3ఏ, 160 భాగం	లేవు
2.	113/2	0.28	0.28							లేవు
3.	113/4	0.24	0.24							లేవు
4.	113/5	0.26	0.26	జిరాయితీ నంజ						లేవు
5	113-6	0.28	0.28	జిరాయితీ నంజ	1) చందక రాజవరహాలు (తండ్రి) చక్రరావు 2) చందక చక్రరావు (తండ్రి) అప్పారావు	సర్వే నెం. 114-4.5బి	ఇండ్లు	కాలువ	సర్వే నెం. 159-3ఏ 160 భాగం	లేవు
6	113-3	0.24	0.12		1) దాసరి కనకలక్ష్మి భర్త లోవరాజు					లేవు
			0.12		2) బొర్లా వీరనాగవరలక్ష్మి భర్త శ్రీనివాసరావు					
7	159-4	1.02	1.02	జిరాయితీ నంజ	చందక చక్రరావు తండ్రి అప్పారావు					లేవు
8	114-6	1.51	0.80		1) కటారి మరిడయ్య 2) కటారి చిన అప్పారావు					లేవు
			0.48		1) జలసూత్రం రాములు					
9	160	3.66	1.48		1) శ్రీ యిసరపు సత్యనారాయణ తండ్రి సీతన్న 2) శ్రీ యిసరపు సీతారామరాజు తండ్రి సత్యనారాయణ					లేవు లేవు
	మొత్తం		7.20							

సం/- డా॥ కృతికా శుక్లా, ఐ.ఎ.ఎస్.,
కలెక్టరు &జిల్లా మేజిస్ట్రేటు,
కాకినాడ జిల్లా, కాకినాడ

బాబు సీఎంగా లేరనే అక్కసుతోనే

జగన్‌పై దుష్ప్రచారం: అంబటి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: చంద్రబాబు సీఎంగా లేరనే అక్కసుతో జగన్ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రామోజీకి సొంత ఆస్తిలా టీడీపీ ఉందని, చంద్రబాబుకు రామోజీరావు రాజగురువు అని విమర్శించారు. ప్రభుత్వంపై రోజుకో దుష్ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. చంద్రబాబు అధికారంలో లేరని, జగన్ సీఎం పదవిలో ఉన్నారన్న కోపంతో పాటు, మరో కారణం వల్ల పదే పదే పోలవరం ప్రాజెక్టుపై దుష్ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. నాడు టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రపంచంలోనే పెద్ద స్కామ్‌కు పాల్పడ్డారన్నారు. రూ.3300 కోట్లకు పైగా ప్రాజెక్టును నామినేషన్ విధానంలో నవయుగకు ఇచ్చారని విమర్శించారు. జగన్ సీఎం కాగానే, దానిపై వివరాలు సేకరించి మళ్లీ టెండర్లు పిలిచారని పేర్కొన్నారు. 12.6 శాతం లెస్‌కు రూ.820 కోట్ల లాభం జరిగేలా ఎంఈఐఎల్‌కు ఇచ్చారనీ, దీనిపై రాద్ధాంతం చేస్తున్నారని దుయ్యబట్టారు. చంద్రబాబును అధికారంలోకి తీసుకురావాలన్న తాపత్రయానికి గురవుతున్నారన్నారు.

ఆత్మస్థైర్యం పెంచే బాధ్యత టీచర్లదే

సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఎస్సీ గురుకులాల్లో చదువుకొనే విద్యార్థులలో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించే బాధ్యత ఉపాధ్యాయులదేనని సాంఘిక సంక్షేమ మంత్రి మేరుగు నాగార్జున స్పష్టం చేశారు. మంత్రి నాగార్జున ఇటీవల విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో పర్యటించి గురుకులాలను ఆకస్మికంగా తనిఖీలు చేసి, విద్యార్థులతో మమేకమై అక్కడి పరిస్థితులను పరిశీలించారు. ఈ మేరకు మంగళవారం ఆయన మీడియాకు వివరాలను వెల్లడించారు. 10 నెలల్లో పూర్తి చేయాల్సిన సిలబస్‌ను రెండు నెలల్లో పూర్తి చేసి మిగిలిన సమయాన్ని విద్యార్థులకు వదిలేస్తే ఎలాగని ప్రశ్నించారు. ప్రతి పరీక్షకూ విద్యార్థులు సన్నద్ధమయ్యేలా వారికి తర్ఫీదును ఇవ్వాల్సిన గురుతర బాధ్యత కూడా టీచర్లదేనన్నారు. ఇటీవల కాలంలో ఇద్దరు విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడిన శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల గురుకులాన్ని మంత్రి సందర్శించి అక్కడి విద్యార్థినిలతో మాట్లాడారు. ఇతర గురుకులాల్లోనూ అనేక మంది విద్యార్థులతో మాట్లాడి పాఠ్యాంశాలలో వారి ప్రతిభను పరీక్షించారు. విద్యార్థుల కోసం వండిన ఆహారాన్ని పరిశీలించడంతో పాటుగా విద్యార్థులతో కలిసి భోజనాలు చేశారు. ఉపాధ్యాయులు క్రమబద్ధంగా విద్యార్థులకు పరీక్షలు పెడుతూ వారిలో తక్కువ మార్కులు వచ్చే విద్యార్థులతో మళ్లీ పాఠాలను పునశ్చరణ చేయించాలని సూచించారు. విద్యార్థులందరూ అన్ని సబ్జెక్టుల్లో ఉత్తీర్ణులయ్యేలా చూసుకోవాల్సిన బాధ్యత కూడా ఆయా సబ్జెక్టుల ఉపాధ్యాయులదేనని స్పష్టం చేశారు. అవసరమైతే విద్యార్థులకు ట్యూషన్లు పెట్టించి వారు ఉత్తీర్ణత సాధించేలా చూడాలన్నారు. ఈ విషయంలో ఉత్తమ టీచర్లకు ప్రోత్సాహక బహుమతులు ఇవ్వనున్నట్లు మంత్రి ప్రకటించారు. విద్యార్థులు వార్తా పత్రికలను కూడా చదివేలా చూడాలని అన్నారు.

అంబేద్కర్ నమూనా విగ్రహ పరిశీలన కోసం దిల్లీకి మంత్రులు, అధికారులు

విజయవాడలో తలపెట్టిన 125 అడుగుల అంబేద్కర్ నమూనా విగ్రహాన్ని పరిశీలించేందుకు అంబేద్కర్ విగ్రహ కమిటీకి చెందిన మంత్రులు, అధికారుల బృందం త్వరలోనే దిల్లీకి వెళ్లనుందని మంత్రి నాగార్జున వెల్లడించారు. 'డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్వరాజ్ మైదాన్' ప్రాజెక్టులో భాగంగా విజయవాడ పీడబ్ల్యుడీ మైదానంలో ఏర్పాటు చేయనున్న అంబేద్కర్ విగ్రహ నిర్మాణ పనులను మంగళవారం మంత్రి పరిశీలించారు. విగ్రహంతో పాటుగా చేపట్టనున్న ఇతర నిర్మాణ పనుల ప్రగతిని అధికారులు నాగార్జునకు వివరించారు. నాగార్జున మాట్లాడుతూ సీఎం జగన్ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ రాబోయే అంబేద్కర్ జయంతి నాటికి ఆవిష్కరించడానికి వీలుగా పనులు జరుగుతున్నాయని చెప్పారు. ఈ విగ్రహానికి సంబంధించి బంక మట్టి, మైనం నమూనా విగ్రహాలను పరిశీలించి ఆమోదం తెలపడానికి నిర్మాణ కమిటీలో సభ్యులుగా ఉన్న మంత్రులు, అధికారుల బృందం త్వరలోనే దిల్లీకి వెళ్లనుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్, సాంఘిక సంక్షేమ శాఖ ఇన్‌ఛార్జి కార్యదర్శి ఏఎండీ ఇంతియాజ్, సంచాలకులు హర్షవర్ధన్, అధికారులు శ్రీనివాస్ ప్రసాద్, శ్రీనివాస్ రావు, కేపీసీ డైరెక్టర్ వాసుదేవరావు, ప్రాజెక్టు మేనేజర్లు జావేద్, కృష్ణ మోహన్ పాల్గొన్నారు.

సంపాదకీయం

అణచివేత పరిష్కారం కాదు

ఇచ్చిన హామీని, చేసిన వాగ్దానాన్ని నెరవేర్చే అలవాటు లేని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ మార్గంలోనే ఆంధ్రప్రదేశ్‌లో వైసిపి ప్రభుత్వం నడుస్తోంది. ఎన్నికల ప్రచారంలో అనేక అలవిమాలిన వాగ్దానాలు గుప్పించి వాటిని అమలు చేయలేక చతికల బడి వాగ్దానాన్ని అమలు చేయాలని ఆందోళన బాట పట్టిన రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులపై ఉక్కు పాదం మోపి, ఉద్యమాన్ని అణచివేస్తే సమస్య ఎంత మాత్రం పరిష్కారం కాదు. తాను అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో ఉద్యోగులు వ్యతిరేకిస్తున్న కంట్రిబ్యూటరీ పెన్షన్ పథకాన్ని (సిపిఎస్) రద్దు చేస్తానని జగన్ తన పాద యాత్ర సందర్భంగా వాగ్దానం చేశారు. వాగ్దానాన్ని నెరవేరుస్తారని దాదాపు మూడేళ్లుగా ఎదురుచూసిన ఉద్యోగులు ఇప్పుడు ముఖ్యమంత్రి ఇంటి ముట్టడి, సెప్టెంబరు 1న ఛలో విజయవాడ మిలియన్ మార్చ్‌ని చేపట్టడానికి తీసుకున్న నిర్ణయాన్ని అమలు చేయకుండా ప్రభుత్వం తీవ్ర అణచివేత చర్యలు చేపట్టింది. ఉద్యోగ సంఘాల నాయకులను, ఉద్యోగులను వెతికి వెతికి పట్టుకొని పోలీసులు పోలీసు స్టేషన్లకు తరలించారు. బస్సులో ప్రయాణించే వారి కోసం తనిఖీలు చేసి పట్టుకున్నారు. ఇళ్లకు వెళ్లి వందలాది మంది ఉద్యోగులకు నోటీసులు ఇచ్చి వారిని నిలువరించారు. రాష్ట్ర వ్యాప్తంగా సిపిఎస్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి ఎక్కడి ఉద్యోగులను అక్కడే కట్టడి చేసి రాష్ట్రమంతటా వందల మందిని అరెస్టు చేశారు. ఇదొక కొత్త వ్యూహం. ఇళ్లకు వెళ్లి రెండు, మూడుసార్లు నోటీసులు ఇవ్వటం, నిర్బంధాలు విధించడం అధికారం ఉంది కదా అని నిరంకుశంగా వ్యవహరిస్తే రాష్ట్ర వ్యాప్తంగా వ్యతిరేకత ఏర్పడుతుంది. తమది ఇచ్చిన హామీలను అమలు చేసే ప్రభుత్వమని ముఖ్యమంత్రి పదేపదే చెప్తున్న మాటలకు ఆచరణకు ఏమాత్రం పొంతనలేని వ్యవహారం ఇది.

నిర్బంధకాండతో ఉద్యోగులను కట్టడి చేయడం, అరెస్టులు, బెదిరింపులు సాగిన నేపథ్యంలో ఉద్యోగ సంఘాలు మిలియన్ మార్చ్‌ని సెప్టెంబరు 11 కు వాయిదా వేసుకున్నాయి. ముఖ్యమంత్రి ఇంటి ముట్టడిని విరమించుకుంటున్నామని పిలుపిచ్చిన ఉద్యోగ సంఘాలు ప్రకటించడం పరిస్థితులు ఉద్రిక్తంగా మారకూడదనే ఈ నిర్ణయం తీసుకున్నట్టు చెప్తున్నారు. అంత మాత్రం చేత ఆందోళనను విరమించుకున్నట్లు కాదు. ఆందోళన చేపట్టడానికి ముందు ఆర్థిక మంత్రి, ఇతర మంత్రులు మూడుసార్లు చర్చలు జరిగినప్పటికీ సిపిఎస్ రద్దు సమస్య ఎటూ తేలకుండా ప్రతిష్టంభన నెలకొంది.

సిపిఎస్ రద్దుచేసి పాత పెన్షన్‌పథకాన్ని (ఒపిఎస్) పునరుద్ధరించాలన్నది ఉద్యోగుల డిమాండ్. 2004 లో కొత్త పథకం నాటి వైఎస్ఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాటినుండి ఉద్యోగులు కోరుతున్నా చెవిటివాడి ముందు శంఖం ఊదినట్టుగా పరిస్థితి కొనసాగుతోంది. జగన్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు చంద్రబాబు పాలనలోనూ ఈ సమస్య అపరిష్కృతంగానే ఉన్నది. పిఆర్‌సి విషయంలోనూ సుదీర్ఘ కాలం ఉద్యోగులు ఆందోళన చేపట్టారు. అప్పుడూ దమనకాండ సాగింది. అయినప్పటికీ చర్చల ద్వారానే సమస్య పరిష్కారమైంది. అప్పుడు ఉద్యోగుల సంఘాలతో ముఖ్యమంత్రి జగన్ చర్చించినట్టుగా ఇప్పుడు కూడా ఆయా సంఘాల నాయకులను చర్చలకు పిలిచి పరిష్కరించాలి. రాష్ట్రం ఆర్థికంగా క్లిష్ట సమయంలోనూ ఏదో విధమైన పరిష్కారం పాలకులు చూపించాలి. ఉద్యోగుల ఒత్తిడి కారణంగా ఛత్తీస్‌ఘర్‌లోనూ ప్రభుత్వం సిపిఎస్‌ను రద్దుచేసి ఒపిఎస్‌ను అమలు చేస్తోంది. ఒపిఎస్‌కు బదులుగా గ్యారంటీ పెన్షన్ పథకాన్ని (జిపిఎస్) అమలు చేస్తామని ప్రభుత్వం చెప్పే మాటలు ఉద్యోగులను ఎంత మాత్రం సంతృప్తిపరిచేవి కాదు. జీవితంలో అత్యధికభాగం ప్రభుత్వసర్వీసులో పనిచేసి పదవీ విరమణ తర్వాత భద్రమైన జీవనంకోసమే మొదటపెన్షన్ ప్రవేశపెట్టారు.

అయితే కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వ పాలన ప్రారంభమైన నాటి నుండి ఉద్యోగుల, ప్రజల వ్యతిరేక విధానాలను దూకుడుగా అమలు చేస్తోంది. ఉదార విధానాలను అమలు చేస్తూ కార్పొరేట్లకు, అపార సంపన్నులకు అనుకూలంగా పని చేస్తోంది. తాను అమలు చేయడమేగాక రాష్ట్రాల మెడపై మోదీ కత్తిపెట్టి దేశమంతటా అమలు చేయిస్తున్నారు. ఇందులో భాగంగానే విద్యుత్, విద్య, వైద్య సంస్కరణలు అమలు చేస్తూ ప్రజల జీవితాలలో కల్లోలం రేపుతున్నారు. ఈ విషయాలన్నీ సామాన్యులకు తెలియకపోయినా తెలిసిన రాష్ట్ర పాలకులు కేంద్రం నిర్ణయాలను నిలువరించడానికి గట్టిగా ప్రయత్నించాలి. కేంద్రాన్ని నిలదీసి అయినా ప్రజలకు, ఉద్యోగులకు హాని జరగకుండా చూడాలి. అప్పుడే అది ప్రజా రంజక పాలన అనిపించుకుంటుంది. కేంద్ర ప్రభుత్వం అన్ని రంగాల సంస్థలను ప్రైవేటుపరం చేసి క్రమంగా ప్రభుత్వ ఉద్యోగాలు లేకుండా చేయడానికి అన్ని చర్యలూ చేపడుతున్నది. అదే దారి పడుతున్న రాష్ట్రాలు తీవ్రమైన ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొంటాయి. ప్రజా పోరాటాల పైన, ఉద్యోగుల ఆందోళనల పైన దమనకాండ సాగించి సమాజంలో కల్లోల పరిస్థితులను సృష్టిస్తే అంతిమంగా అలాంటి ప్రభుత్వాలకు ముప్పు తప్పదు. ఇప్పటికైనా జగన్ ప్రభుత్వం సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్ పునరుద్ధరించాలి. తప్పనిసరిగా అమలు చేయవలసిన అవసరమున్న పథకాల రద్దు కూడని పని. ఉచితాల రద్దు పేరుతో ప్రజా సంక్షేమాన్ని విస్మరిస్తే పాలకులకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పకుండా ఉండరు.

ఉచితాల పేరుతో సంక్షేమ పథకాల రద్దు యోచన

డా॥సోమ మర్ల

ప్రస్తుతం దేశంలో పేదల కిచ్చే ఉచితాలు (రాయితీలపై) సుదీర్ఘమై చర్చ జరుగుతుంది. ఈ చర్చను ప్రధాని మోదీ ప్రారంభించగా విద్వేషపూరిత మత కలహాల్లో ప్రసిద్ధి కెక్కిన శ్రీఉపాధ్యాయ సుప్రీం ధర్మాసనాన్ని ఆశ్రయించారు. సుప్రీంకోర్టు దీనిని వెంటనే స్వీకరించి వివిధ రాజకీయ పార్టీలతో చర్చించి నివేదికనే సర్పించమని త్రిసభ్య కమిటీని సైతం ఆఘమేఘాల మీద నియమించింది. ఈ కమిటీ విచారణకు చేపట్టే లిస్టులో ఉన్న ఉచితాలు: జాతీయ ఆహార పథకంలో భాగంగా పేదలకిచ్చే రేషను దినుసులు, గ్రామీణ ఉపాధి పథకం, పంటల మద్దతు ధరలు, మధ్యాహ్న భోజన పథకం (పాఠశాల విద్యార్థులకు) ఉచిత లేదా చౌక విద్యుత్ (రైతులకు) మొదలైన అంశాలున్నాయి. విశేషమేమంటే పెద్ద కంపెనీల కిచ్చే లక్షల క్లో రూపాయల విలువ చేసే పన్ను రాయితీలు, సడలింపులు, బ్యాంకు రుణాలు ఎగవేయటం ఈ జాబితాలో ఉచితాల కింద చేర్చకపోవటం ఆశ్చర్యం కలిగిస్తుంది.

ఏదేనా విషయాన్ని లేవనెత్తి దానిని వివాదాస్పదం చేయటంలో మన ప్రధాని మోదీకున్న చాకచక్యం గమనించగలిగినదే.జి.ఎస్.టి మోతతో పెరిగిన ధరలతో, పెట్రోలు ధరలతో నిరుద్యోగంతో సతమతమవుతున్న ప్రజల దృష్టిని పక్కదారి పట్టించి, ఉచితాలు ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నాయని చూపాలని ప్రధాని ఆలోచన కావొచ్చు బహుశా.

హక్కుల పోరాటంపై దాడి

ప్రస్తుతం దేశం వేగంగా వృద్ధి బాటలో ఉందని, మూడు ట్రిలియను డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ప్రపంచంలో ఆరవ శక్తిమంతమైన దేశంగా పెరిగిందని ఎన్ని ప్రచారాలు చేసినా ప్రజల జీవన పరిస్థితుల్లో వచ్చిన మార్పులు మృగ్యం. ప్రజల చేతుల్లో మొబైల్ ఫోన్లు, కొద్దిమందికి మోటారు సైకిళ్లు ఉండవచ్చు కానీ, నిరుద్యోగులు లేని కుటుంబం ఉన్నదా, అప్పుల బాధతో స్కూలు పిల్లల ఫీజులు, కనీస ఆహారం, వైద్య ఖర్చులను భరించగల ఆర్థిక స్థోమత ఎంతమందికి ఉంది. విదేశాల వరకు ఎందుకు మన పక్కనున్న బంగ్లాదేశ్, శ్రీలంక, బూటాన్‌ల కంటే విద్య, వైద్యం, గృహ వసతి వంటి అంశాల్లో మనం చాలా వెనుకబడి ఉన్నాం. ప్రపంచ ఆకలి సూచిలోని 116 దేశాల్లో మన స్థానం 101 లో ఉన్నదంటే దేశంలో ఉన్న ఆకలి గురించి మరింత చర్చించవల్సిన అవసరం లేదు. ఇంతెందుకు ఆరు నెలల క్రితం జరిగిన ఉత్తరప్రదేశ్ ఎన్నికల్లో బిజెపి గెలుపునకు ప్రధాన కారణం కోట్ల మంది పేదలకు ఉచితంగా 376 మెట్రిక్ టన్నుల గోధుమలు, పప్పు దినుసులను 'ప్రధాన మంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన' పథకంకింద పంచటం వలన కాదని చెప్పగలరా? ఉచితాల రద్దులో భాగంగా అనేక ధరలతో తల్లడిల్లుతున్న ప్రజానీకానికి కొంతవరకైనా ఊరట కల్పించే ప్రభుత్వ పంపిణీ వ్యవస్థను చేర్చటం ఎంతవరకు సమంజసం.

ఇటీవల కోవిడ్ కష్టకాలంలో లాక్‌డౌన్ కారణంగా ఉద్యోగాలు కోల్పోయి గ్రామలకు వలస వచ్చిన పట్టణ కార్మికులను ఆదుకున్నది జాతీయ గ్రామీణ ఉపాధి పథకం కాదా? ఈనాడు ఈ ఉపాధి పథకాన్ని ఉచితాల జాబితాలో చేర్చి రద్దు చేయాలనటం ఎంతవరకు సమంజసం. వ్యాపారుల దొంగ నిల్వలతో, బ్లాక్ మార్కెటింగ్‌లో పెరిగిన ధరలతో తల్లడిల్లుతున్న ప్రజలకు కమ్యూనిస్టు పార్టీ అరవై, డెబ్బయి దశాబ్దాల్లో సాగించిన మిలిటెంటు అధిక ధరల వ్యతిరేక పోరాటాల ఫలితంగానే ఆనాడు పేదలకు చౌకగా సబ్సిడీపై ఆహార పథకాల నందించే ప్రభుత్వ పంపిణీ వ్యవస్థ రూపుదిద్దుకున్నది. తదుపరి అధికారంలో ఉన్న వివిధ ప్రభుత్వాలు అనుసరించిన నయా ఉదార ప్రజా వ్యతిరేక ఆర్థిక విధానాల కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ సంక్షోభం పెరిగి దారిద్ర్యం, నిరుద్యోగం తాండవించ సాగింది. దీనిపై ప్రజలకు ఉపశమనాన్ని ఇచ్చేటందుకు గత యు.పి.ఎ ప్రభుత్వ హయాంలో కమ్యూనిస్టుల ఒత్తిడితో జాతీయ ఆహార భద్రతాచట్టం, గ్రామీణ ఉపాధి పథకాలు ప్రారంభించారు. పంటలకు కనీస మద్దతు ధరలు కల్పించాలని రైతులకు మార్కెట్‌లో కొంత వరకైనా ఉపశమనం కలిగించాలని వామపక్ష రైతు సంఘాల పోరాటాల ఫలితంగా కొంత వరకైనా ప్రభుత్వం ప్రకటించిన పంటల మద్దతు ధరల విధానం అమల్లోకి వచ్చింది. ప్రభుత్వ ఖజానాకు గండి పడుతుందనే వాదనతో పేదలకు, రైతులకిచ్చే వివిధ సబ్సిడీలను ఉచితాలుగా లెక్కించి వాటిని రద్దు చేయాలనుకోవటం కేవలం ప్రజలు తమ కనీస హక్కులపై సాగించే ఉద్యమాలమీద దాడి మాత్రమేనని గుర్తించాలి.

ప్రభుత్వ పన్నుల వసూళ్లు- రాబడి

అనునిత్యం మార్కెట్‌లో వివిధ వస్తువుల కొనుగోళ్లపై, సేవలపై విధించే జి.ఎస్.టి, పెట్రోలు, డీజిల్‌పై విధించే అధిక ఎక్సైజ్ పన్నులు, ఇన్‌కంటాక్స్ వగైరాలన్నీ ప్రజలు చెల్లించే పరోక్ష పన్నులు (ఇన్ డైరెక్టు ట్యాక్సులు) గా భావిస్తారు. వీటి ద్వారా ప్రభుత్వ ఖజానాకువచ్చే మొత్తం రాబడిలో 70 శాతంగా ఉన్నది. ఈ పన్నులను అత్యధిక ధనవంతుడైన అంబానీ, ఒక సామాన్యుడు ఒకే విధంగా చెల్లిస్తారు. ధనికులు ఎక్కువ పన్నులు చెల్లించవల్సిన అవసరం లేదు. కోవిడ్ కష్టకాలంలో పారిశ్రామికాధిపతులు చెల్లించే "కార్పొరేటు" పన్నును 30 శాతం నుండి 20 శాతానికి తగ్గించివేశారు. దీనివలన కేంద్ర ప్రభుత్వ ఖజానాకు 1.53 లక్షల కోట్ల రాబడి తగ్గింది. అత్యంత ధనవంతులు "సంపద పన్ను" వారసత్వ సంపదపై పన్నులు కట్టనక్కరలేదు. వీటిని 2017 వ సం॥లో గత ఆర్థికమంత్రి కీ.శే.అరుణ్‌జైట్లీ రద్దు చేశారు.

వ్యయం- ప్రభుత్వ ఆహార పంపిణీ వ్యవస్థ, గ్రామీణ ఉపాధులపై ఖర్చు- కేంద్ర బడ్జెట్‌లో వాటా రూ॥ల్లో 2.6 లక్షల కోట్లు.

వ్యయం- పెద్ద కంపెనీలకు ఇచ్చిన పన్ను రాయితీలు, కొట్టి వేసిన బ్యాంకు అప్పులభారం-కేంద్రబడ్జెట్‌లో వాటా రూ॥ల్లో 13.9 లక్షల కోట్లు.

ఈ అంశాల ద్వారా ప్రభుత్వం బడా పారిశ్రామికవేత్తల కిచ్చే రాయితీలు కలిగించే నష్టం ఆర్థిక వ్యవస్థకు, ద్రవ్యలోటుకు కారణమని భావించాలి.సామాన్యులకి ఊరట నిచ్చే సంక్షేమ పథకాల వల్ల ఏ మాత్రం "ఆర్థిక లోటు" కలుగక పోగా సామాన్యుల జీవన పరిస్థితులు కొంతవరకు మెరుగుపడుతున్నాయి. దిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం చేపట్టిన ఒక ఆర్థికసర్వే ద్వారా తేలిందేమిటంటే ప్రభుత్వ చౌక దుకాణాలు, పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాలను సక్రమంగా నిర్వహిస్తే జి.డి.పి లో 1.3 శాతం వృద్ధిని తీసుకురావచ్చని నిర్ధారించారు.

కేరళ, తమిళనాడు రాష్ట్రాల ప్రభుత్వాలు ప్రభుత్వ పంపిణీ వ్యవస్థను, కోవిడ్ సమయంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రజల కందించిన సేవలు ప్రశంసనీయం. దేశంలో ఏ రాష్ట్రంలోను లేని విధంగా కేరళలో లాక్‌డౌను సమయంలో పాఠశాల విద్యార్థుల ఇళ్లకు ప్రత్యక్షంగా ఆహార దినుసులను "మధ్యాహ్న భోజన" పథకంలో భాగంగా వితరణ చేసిన ఘనత ఆ రాష్ట్ర ప్రభుత్వానికున్నది. కాగా, పెరిగిన ధరలతో అల్లాడుతున్న ప్రజానీకానికి నిరుద్యోగం, వైద్య సదుపాయాలు అందించడంలో విఫలమైన ప్రస్తుత బి.జె.పి ప్రభుత్వం తన వైఫల్యాలను వివిధ సంక్షేమ పథకాలపై పెట్టే వ్యయాన్ని కారణంగా చూపటవ, తద్వారా వీటి రద్దుని సూచించటం అమానుషం. దేశంలోని ప్రజలు ఐక్యంగా పోరాడి తమ జీవితాలకు కొంతవరకైనా సాంత్వనను ఇచ్చే వివిధ సంక్షేమ పథకాలను, హక్కుల రక్షణకు కదం తొక్కాలి.

త్యాగానికి చిరునామా సర్వదేవభట్ల రామనాథం

చెరుకూరి సత్యనారాయణ

సర్వదేవభట్ల రామనాథం

ఆయన సనాతన బ్రాహ్మణ భూస్వామ్య కుటుంబంలో 1913 లో జన్మించారు. 7800 ఎకరాల తండ్రి ఆస్తిలో తన వాటాగా వచ్చిన 1800 ఎకరాల్లో ఒక్క ఎకరం కూడా సొంతానికి వుంచుకోకుండా పేద రైతులకు పంచిన త్యాగశీలి. వ్యక్తి. దక్షిణ భారతదేశంలో తొలి కమ్యూనిస్టులుగా పుచ్చలపల్లి సుందరయ్య, కంభంపాటి సత్యనారాయణలకు గుర్తింపు ఉంది. అదే తెలంగాణాలో తొలి కమ్యూనిస్టుగా ఆయన్నే పేర్కొనాలి. ఆ మహత్తర వ్యక్తి సర్వదేవభట్ల రామనాథం. తదనంతర కాలంలో తెలంగాణా సాయుధ పోరాట సారథులుగా ఉన్న దేవులపల్లి వెంకటేశ్వరరావు, రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డిలకు రామనాథం సభ్యత్వం ఇచ్చారు. బ్రిటీష్ ఆంధ్రలో తొలి కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణం జరిగింది 1934. తొలి మహాసభ జరిగింది 1936లో. ఒంగోలు సమీపంలోని కొత్తపట్నంలో కమ్యూనిస్టులు, రైతు సంఘాల కార్యకర్తల కోసం 1937లో నిర్వహించిన రాజకీయ తరగతులకు తెలంగాణా ప్రాంతం నుండి హాజరైన ఏకైక విద్యార్థి రామనాథం. 1938 అక్టోబర్‌లో జరిగిన స్టేటు కాంగ్రెసు సత్యాగ్రహం 1938 నవంబర్ లో జరిగిన వందేమాతరం విద్యార్థి ఉద్యమం, 1939 డిసెంబర్‌లోఏర్పడ్డ "కామ్రేడ్స్ అసోసియేషన్" కంటే చాలాముందే కొత్తపట్నం పాఠశాల జరిగింది. 1938 తర్వాత చంద్ర రాజేశ్వరరావుకు తెలంగాణాలో పార్టీవిస్తరణ బాధ్యత కమ్యూనిస్టు పార్టీ అప్పగించింది. ఆయనకు దొరికిన తొలి కాంటాక్టు రామనాథం.

రామనాథంకు చిర్రావూరి లక్ష్మీనర్సయ్య బంధువు. స్కూల్లో జూనియర్. పెరవలి వెంకట రమణయ్య రామనాథం క్లాసుమేటు, పోలీసు సబ్ ఇన్‌స్పెక్టరుగా ఉద్యోగం వచ్చినా రామనాథం కారణంగా ఆ ఉద్యోగానికి రాజీనామా చేసి పార్టీ పూర్తికాలం కార్యకర్తగా రావటమేగాక తెలంగాణా పార్టీ తొలి కార్యదర్శిగా పనిచేశారు. 1945లో జరిగిన 12వది, చివరిది అయిన ఆంధ్ర మహాసభ సభలు పెద్దఎత్తున ఖమ్మంలో జరగటంలో మొత్తం నిర్వహణ బాధ్యత రామనాథం తీసుకున్నారు. ఖమ్మం, వరంగల్, హైదరాబాద్, నాగపూరుల్లో విద్యాభ్యాసం చేసినా యం.ఏ., గాని, లా గాని పూర్తి చేయకుండానే ఖమ్మం చేరాడు. 1942లో సొంత ఇంటిని హరిజన పాఠశాలకు దానం చేసి అద్దె ఇంట్లో వున్నారు. పార్టీ ఆదేశంలో సింగరేణి బొగ్గు గనుల్లో కార్మిక ఉద్యమాన్ని నిర్మించి, సింగరేణి కార్మిక సంఘానికి తొలి అధ్యక్షునిగా పనిచేశారు. ఆ తర్వాత వరంగల్ అజంజాహిమిల్లు కార్మికుల్లో పనిచేసిఅక్కడ పటిష్టమైన కార్మిక ఉద్యమాన్ని నిర్మించారు. తోలు పరిశ్రమల కార్మికుల్ని కూడా సంఘటితం చేశారు.

1939లో అరెస్టయి 6 నెలలు నాగపూరు జైల్లో వున్నారు. రెండో సారి ఖమ్మంలో అరెస్టు జరిగి 1946 వరకు 2 సంవత్సరాలు, మూడో సారి చిర్రావూరి లక్ష్మీనర్సయ్యతో కల్సి వరంగల్‌లో అరెస్టు అయి 1952 వరకు జైల్లో వున్నారు. 1952 తొలి జనరల్‌ఎన్నికల్లో రామనాథంతో సహా ప్రధాన నాయకత్వం అంతా జైళ్లలోనో, అజ్ఞాతంగానో వుండటం వలన అభ్యర్థులు లేక పెండ్యాల రాఘవరావు ఒక్కరే వరంగల్ పార్లమెంటుస్థానానికి, హనుమకొండ, వర్ధన్నపేట శాసనసభా స్థానాలకు పోటీ చేయటమేగాక మూడింటిలోనూ విజయం సాధించి పార్లమెంటు సభ్యత్వాన్ని అట్టి పెట్టుకొని రెండు శాసనసభా స్థానాలకు రాజీనామా చేశారు. ఉపఎన్నికల్లో హనుమకొండ శాసనసభాస్థానానికి రామనాథంను పార్టీ ప్రకటించింది. 1952 మే 2 నుండి పార్టీ తెలంగాణాలో బహిరంగంగా పనిచేస్తుంది. కాని రామనాథంని విడుదల చేయలేదు. పార్టీ పార్లమెంటు సభ్యులంతా నెహ్రూని కలవటంతో ఎన్నికలకు 10 రోజుల ముందు ఆయన్ను విడుదలచేశారు. హడావుడిప్రచారం అయినా 5వేలఓట్ల ఆధిక్యతతో జమలాపురం కేశవరావుపై విజయం సాధించారు.

1857, 1962 ఎన్నికల్లో మానుకోట పార్లమెంటు స్థానానికి పోటీ చేసి ఒకసారి ఐదు వందలు, మరోసారి వెయ్యి ఓట్ల తేడాతో ఓడిపోయారు. ఈ రెండుసార్లు నూకల రామచంద్రారెడ్డి నాయకత్వంలో భూస్వాములు తీవ్రమైన గుండాగిరి చేశారు. 1964 పార్టీ చీలిక సందర్భంగా సి.పి.ఐలో కొనసాగినా 1967 తర్వాత అనారోగ్యంతో అన్ని బాధ్యతల నుండి వైదొలిగారు. అనారోగ్యం బారిన పడిన రామనాథం ని పార్టీ రష్యా పంపించి మెరుగైన వైద్యం అందేట్లు చూడటమే గాక, ఆయన కొడుకుని ఉన్నత విద్యకోసం రష్యా పంపింది. చివరి రోజుల్లో దుర్భర దారిద్ర్యం అనుభవిస్తూ తన సొంత ఇంటిని అద్దెకిచ్చి ఆ ఇంటి ఎదురుగా ఒక గుడిసెలో 6 గురు కుటుంబ సభ్యులతో నివసిస్తూ ఆ అద్దెపై జీవనం సాగించారు. ఆయన్ను పరామర్శించటానికి వెళ్లిన బాల్య మిత్రులు ఆయన ముందు ఒక ప్రతిపాదన పెట్టారు. గతంలో ఆయన దానం చేసిన పొలాలకు గాను కొందరికి పట్టాలు రాలేదని, రామనాథం సంతకం కావాలని అలా ప్రతి ఎకరానికి 50 రూపాయలు తీసుకునే ఏర్పాటు చేస్తామంటే. నేను దానం చేసిన భూమి మళ్లీ డబ్బు తీసుకొని సంతకం పెట్టమంటారా అని మందలించి బస్సు ఛార్జీలు ఇస్తే వచ్చి సంతకాలు చేస్తానని చెప్పి అలాగే చేశారు. చివరకు 1992 సెప్టెంబర్ 1 వ తేది హైదరాబాద్ నిమ్స్‌లో తుదిశ్వాస విడిచారు. ఈ త్యాగశీలికి దక్కాల్సినంత గుర్తింపు, గౌరవం దక్కలేదు. ఈ విషయం తెలంగాణా వామపక్ష ఉద్యమకారులు ఆలోచించాలి.

(సెప్టెంబర్ 1 రామనాథం 30 వ వర్థంతి సందర్భంగా)

కెసిఆర్ దూకుడు! సీమ దాహార్తికి ఎసరు!



వి. శంకరయ్య

పోలవరం నుండి కృష్ణకు వచ్చే గోదావరి నీళ్లలో 80 టియంసిలు ఎగువ రాష్ట్రాలకు 35 టియంసిలు పోగా మిగిలిన 45 టియంసిలు నీటి వాటా రెండు తెలుగు రాష్ట్రాల మధ్య తేలక ముందే కెసిఆర్ ఏక పక్షంగా పాలమూరు రంగారెడ్డి పథకానికి నికర జలాల కింద కేటాయిస్తూ, జీవో జారీ చేస్తే ఎపి ప్రభుత్వం గాని వైకాపా మంత్రులు ఎందుకు నోరు విప్పడం లేదు? గత కొంత కాలంగా ప్రతి అంశాన్ని యాగీ చేస్తూ యాజమాన్య బోర్డుకు తెలంగాణ ఇంజనీరింగ్ చీఫ్ మురళీధర్ లేఖలు మీద లేఖలు రాస్తున్నారు. తుదకు హంద్రీనీవా పంపింగ్ ఆపాలని కెసి కెనాల్ ద్వారా బేసిన్ అవతలికి నీళ్లు తరలించడం నిలుపుదల చేయాలని ఇలా ఎన్నో అంశాలపై అభ్యంతరాలు లేఖల ద్వారా తెలిపారు. కాని ఎపి నుండి ఎందుకు స్పందన లేదు? లక్షలాది రూపాయలు వేతనాలు పొందే అధికారులతో పాటు సలహాదారులు వున్నారు. కాని తెలంగాణ చర్యలపై సకాలంలో స్పందన వుండటం లేదు. గమనార్హమైన అంశమేమంటే ఈ జీవో పై అంతర్గతంగా తెలంగాణలో చిచ్చు రేగింది. చెరపకురా చెడేవు అనేది నీతి. ఇప్పుడు తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ సరిగ్గా ఇదే దుస్థితిలో ఇరుక్కున్నారు.

ఆంధ్ర ప్రదేశ్‌ను దెబ్బ తీయాలని జారీ చేసిన ఈ జీవో ఇప్పుడు కెసిఆర్ మెడకు ఉచ్చులా తగులుకొన్నది. పోలవరం ప్రాజెక్టు ద్వారా కృష్ణా నదిలో కలిసే 80 టియంసిల్లో ఎగువ రాష్ట్రాలు మహారాష్ట్ర కర్నాటకకు 35 టియంసిలు మిగిలిన 45 టియంసిలు సాగర్ ఎగువ భాగంలో వినియోగించుకోవాలని గోదావరి ట్రిబ్యునల్ తీర్పులో పొందు పర్చింది. రాష్ట్ర విభజన తర్వాత 45 టియంసిలు తమకే చెందుతాయని తెలంగాణ వాదిస్తోంది. ఈ 45 టియంసిలు ఎపి తెలంగాణ దామాషా పద్ధతిలో పంచుకోవాలనే ప్రతిపాదన వున్నా ఇంత వరకు ఎటూ తెగ లేదు. అయితే కెసిఆర్ ఇంత వరకు ఈ 45 టియంసిలు శ్రీశైలం ఎడమ కాలువ ద్వారా నల్గొండ జిల్లాకు ఇస్తామని ప్రచారం చేస్తూ వుండి ఇప్పుడు హఠాత్తుగా పాలమూరు రంగారెడ్డి పథకానికి నికర జలాల కింద కేటాయించుతూ జీవో జారీ చేశారు. ప్రస్తుతం నల్గొండ జిల్లాలో ఉప ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో పార్లమెంటు సభ్యుడు కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఈ జీవో రద్దు చేయాలని లేదా దీక్షకు దిగుతామని హెచ్చరించారు. ఈ వివాదం వారి అంతర్గత సమస్య అయినా ఏకంగా 45 టియంసిలు తెలంగాణకు లభ్యమయ్యే అవకాశం లేదు.

ఈ పంచాయతీ కేంద్ర జల శక్తి శాఖ మంత్రి షెకావత్ వద్ద కూడా జరిగింది. ఈ అంశం ట్రిబ్యునల్‌కు కేటాయించాలనా లేక సామరస్యంగా పరిష్కరించుకోవాలెనా ఎటూ తేలక ముందే తొందర పడి కూత వేసిన కోడిలాగా పాలమూరు రంగారెడ్డి పథకానికి నికర జలాల కింద కేటాయించుతూ జీవో జారీ చేసి అంతర్ రాష్ట్ర వివాదంతో పాటు అంతర్గత వివాదంలో కూడా కెసిఆర్ చిక్కుకొన్నారు. వాస్తవంలో పాలమూరు రంగారెడ్డి పథకం గాని దిండి ఎత్తిపోతల పథకం గాని రాష్ట్ర విభజన తర్వాత ప్రతి పాదించినవే. ఈ పథకాలకు అపెక్స్ కౌన్సిల్ ఆమోదం లేదు. డిటెక్టివ్ నవలల్లో మనం ఎరిగే "వాడే వీడు- వీడే వాడు" అనే పద్ధతిలో కాళేశ్వరం ప్రాజెక్టుతో పాటు పాలమూరు రంగారెడ్డి దిండి పథకాల నిర్మాణం కెసిఆర్ చేపట్టారు. రెండు రాష్ట్రాల మధ్య వివాదాలు ముదిరి తుదకు అటు దక్షిణ తెలంగాణ ప్రాజెక్టులు ఇటు రాయలసీమ ప్రాజెక్టులు గ్రీన్ ట్రిబ్యునల్ తీర్పుతో నిర్మాణం నిలచిపోవడం విదితమే.

2013 లో ఉమ్మడి రాష్ట్రంలో జూరాల నుండి 70 టియంసిలు నీరు ఎత్తిపోతలకు సాధ్యాసాధ్యాల పరిశీలనకు పాలమూరు రంగారెడ్డి పథకానికి జీవో జారీ చేశారు. అయితే రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణ ప్రభుత్వం అందుకు దిగువన ఉన్న 180 కిలోమీటర్లలో శ్రీశైలం జలాశయం నుండి 90 టియంసిలు సామర్థ్యంతో ఈ పథకం నిర్మాణం చేపట్టేందుకు 2015 లో జీవో జారీ చేసింది. ఇది కొత్త పథకమని అపెక్స్ కౌన్సిల్ ఆమోదం కూడా లేదని ఎపి అభ్యంతరం పెడితే వాడే వీడు అనే ధోరణిలో 2013 లో జారీ చేసిన జీవో చూపెట్టి నిర్మాణం చేపట్టారు. అదే విధంగా దిండి ఎత్తిపోతల పథకానికి 2007 లో ఉమ్మడి రాష్ట్రంలో జీవో జారీ చేశారు. శ్రీశైలం ఎడమ కాలువ నిర్మాణం పూర్తయితే టన్నెల్ ద్వారా దిండి రిజర్వాయర్‌కు నీటి సరఫరాకు జీవో జారీ చేశారు. కాని రాష్ట్ర విభజన తర్వాత కెసిఆర్ ఏకంగా శ్రీశైలం జలాశయం నుండి 30 టియంసిలు నీరు ఎత్తిపోతలకు 2015 లో జీవో జారీ చేసి ఇది కూడా పాత పథకమేనని దబాయింపు రాజకీయం సాగించారు.

2019 ఎన్నికల తర్వాత ఇరువురు ముఖ్యమంత్రులు అలాయ్ బలాయ్ ఆడిన సందర్భంలో ఈ సమస్యలన్నీ సామరస్యంగా పరిష్కారమౌతాయని ప్రధానంగా రాయలసీమ వాసులు భావించారు. అయితే అది మూన్నాళ్ళ ముచ్చటగా మిగిలి పోయింది. తుదకు అంతర్ రాష్ట్ర జల వివాదంగా కోర్టులకు చేరింది. ఈ నేపథ్యంలో గ్రీన్ ట్రిబ్యునల్ అటు పాలమూరు రంగారెడ్డి పథకానికి ఇటు రాయలసీమ ఎత్తిపోతల పథకానికి బ్రేక్ వేసింది. పాలమూరు రంగారెడ్డి పథకానికి నికర జలాలు కేటాయింపు లేదు. తుదకు రాష్ట్ర విభజన చట్టం 11 వ షెడ్యూల్‌లో కూడా లేదు. పర్యావరణ పరిరక్షణ చర్యలు కూడా చేపట్టని పూర్వ రంగంలో పోలవరం నుండి వచ్చే గోదావరి జలాలు 45 టియంసిలు పంపకం తేలక ముందే మొత్తం 45 టియంసిల నికర జలాలుగా కేటాయిస్తూ జీవో ఇచ్చారు. ప్రస్తుతం అమలులో వున్న బచావత్ ట్రిబ్యునల్ అవార్డు మేరకు తెలంగాణకు చిన్న నీటి వనరుల కింద 89.16 టియంసిలు కేటాయింపులు వుంది. అందులో 45 టియంసిలు తాము ఉపయోగించుకోవడం లేదని ఆ నీటిని పాలమూరు రంగారెడ్డి పథకానికి మళ్లించి మొత్తం 90 టియంసిలు చూపెట్టి జీవో జారీ చేసి కేంద్ర జల సంఘం ఆమోదానికి సిద్ధమౌతోంది. వాస్తవంలో 45 టియంసిలు ఎవరి వాటా ఎంతో తేలలేదు. ఈ లోపు ఈ జీవో పై నల్గొండ జిల్లాలో రగడ మొదలైంది.

తెలంగాణ ప్రభుత్వం బరి తెగింపునకు కేంద్ర ప్రభుత్వం పాత్ర కూడా వుంది. ఇటీవల కర్నాటకలో అప్పర్ భద్ర ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా గుర్తించే సమయంలో దాని నికర జలాల నీటి కేటాయింపుల్లో పోలవరం నుండి కర్నాటక వాటా కింద 2.65 టియంసిలు నీటిని పరిగణనలోనికి తీసుకొన్నది. మొత్తంగా ఎవరి వాటా ఎంతో తేలక ముందే కర్నాటక వాటాకు ఆమోదం తెలిపినప్పుడు ఎపి ప్రభుత్వం చేష్టలుడిగి వుండినది. దానిని సాకు చూపి తెలంగాణ ఇప్పుడు మొత్తం నీటికి ఎసరు పెట్టింది. పట్టిసీమ నుండి డెల్టాకు వచ్చే నీటి నుండి పోలవరం నీటి వాటా నుండి వచ్చే నీటిని కలిపి మొత్తం నిత్య కరవు పీడిత ప్రాంతమైన తమకు కేటాయించాలని రాయలసీమ వాసులు చిర కాలంగా కోరుతుండగా కెసిఆర్ మధ్యలో మొత్తం నీటికి టెండర్ పెట్టడం రాష్ట్ర ప్రభుత్వం అచేతనంగా వుండటం సీమ వాసులకు పుండుపై కారం రాసినట్లుంది. పాలమూరు రంగారెడ్డికి పోలవరం నీళ్లు కేటాయించినందుకు వెంటనే నల్లగొండ జిల్లా వాసులు తిరగబడ్డారు. కాని ఆంధ్రప్రదేశ్ మాత్రం ఇంత వరకు నోరు విప్పక పోవడం ఆశ్చర్యమేమీ కాదు.

వ్యాస రచయిత విశ్రాంత పాత్రికేయులు

9848394013

ఆప్- బీజేపీ వాగ్యుద్ధం

- 'అవినీతి' పై అసెంబ్లీలో రెండు పార్టీల నిరసనల హోరు
- ఎల్జీ సక్సేనా రాజీనామాకు అధికార పక్షం డిమాండ్
- సిసోడియా, సత్యేందర్ బర్తరఫ్ కోరిన బీజేపీ

న్యూఢిల్లీ : ఢిల్లీ శాసనసభలో 'అవినీతి' పై అధికార ఆమ్ ఆద్మీ పార్టీ... ప్రతిపక్ష బీజేపీ మధ్య వాగ్యుద్ధం కొనసాగుతోంది. ఆగస్టు 29-30 మధ్య రాత్రంతా అసెంబ్లీలో రెండు పార్టీల ఎమ్మెల్యేలు నిరసనలను కొనసాగించారు. ఫలితంగా మంగళవారం కూడా అసెంబ్లీలో రెండు పక్షాలు ఒకరి పై మరొకరు అవినీతి ఆరోపణలు చేసుకున్నారు. ఈ ఉదయం శాసనసభా కార్యకలాపాలు ప్రారంభం కాగానే, ఆప్ శాసనసభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లి, లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్ కుమార్ సక్సేనాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీనికి ప్రతిగా సభలో అనేక అంశాలపై చర్చకు అనుమతించకపోవడంతో అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వంలోని ఢిల్లీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బీజేపీ ఎమ్మెల్యేలు నినాదాలు చేశారు. సక్సేనాకు వ్యతిరేకంగా అధికార పార్టీ ఎమ్మెల్యేల ఆందోళన నడుమ మంగళవారం నాటి సభా కార్యకలాపాలు స్తంభించాయి. కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ), ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నిర్వహించడంతో పాటు ఖాదీ, గ్రామీణ పరిశ్రమల కమిషన్ చైర్మన్‌గా సక్సేనా ఉన్నప్పుడు రూ.1,400 కోట్ల కుంభకోణానికి సంబంధించి ఆయన రాజీనామా చేయాలని ఆప్ సభ్యులు డిమాండ్ చేశారు. 2016లో తన పదవీకాలంలో రూ.1,400 కోట్ల విలువైన రద్దయిన నోట్లను తిరిగి మార్చవలసిందిగా సక్సేనా తన ఇద్దరు అనుచరులపై ఒత్తిడి తెచ్చారని ఆప్ ఆరోపించింది. అసెంబ్లీలో రాత్రి నిరసన సందర్భంగా అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వంలోని పార్టీ ఎమ్మెల్యేలు 'హమ్ హోంగే కామ్యాబ్' వంటి పాటలు పాడుతూ సక్సేనాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆప్ ఎమ్మెల్యేలు మహాత్మాగాంధీ విగ్రహం దగ్గర ప్లకార్డులు పట్టుకుని కూర్చోగా, బీజేపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీ ఆవరణలోని భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ విగ్రహాల దగ్గర బైఠాయించారు. ఢిల్లీ మద్యం పాలసీ 2021-22 అమలులో జరిగిన అవినీతిపై సీబీఐ విచారణకు కొన్ని రోజుల క్రితం సక్సేనా సిఫార్సు చేశారు. మరోవైపు మంత్రులు మనీశ్ సిసోడియా, సత్యేందర్ జైన్‌ను బర్తరఫ్ చేయాలని బీజేపీ నేతలు డిమాండ్ చేశారు. మద్యం విధానం పై విచారణకు సంబంధించి ఆగస్టు 19న సిసోడియా నివాసంతో సహా 31 ప్రాంతాల్లో సీబీఐ దాడులు చేసింది. 'రేపు, మా బ్యాంక్ లాకర్‌ని తనిఖీ చేయడానికి సీబీఐ వస్తుంది. ఆగస్టు 19న నా నివాసంలో 14 గంటలపాటు జరిగిన దాడిలో వారికి ఏమీ దొరకలేదు. లాకర్‌లో కూడా ఏమీ కనిపించలేదు. సీబీఐని స్వాగతించారు. విచారణకు నేను, నా కుటుంబం పూర్తి సహకారం అందిస్తాం' అని ఉప ముఖ్యమంత్రి సిసోడియా సోమవారం హిందీలో ట్వీట్ చేశారు. కాగా, ఢిల్లీ అసెంబ్లీ ప్రత్యేక సమావేశాల్లో భాగంగా సోమ, శుక్రవారాల్లో ఎనిమిది మంది బీజేపీ ఎమ్మెల్యేలలో ఎవరూ లేరు. ఎందుకంటే, మార్షల్స్ ఆ బీజేపీ సభ్యులను బలవంతంగా బయటకు తరలించారు. కేంద్ర ప్రభుత్వాన్ని దుర్భాషలాడేందుకు ఢిల్లీ ప్రభుత్వం అసెంబ్లీని వేదికగా ఉపయోగిస్తోందని ఆరోపించిన బీజేపీ, ఈ అంశాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వద్ద లేవనెత్తుతామని తెలిపింది. మద్యం కుంభకోణంపై ప్రశ్నలకు కేజ్రీవాల్ సమాధానం ఇవ్వాలని, తప్పు చేయకపోతే కోర్టుకు వెళ్లాలని బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా అన్నారు. అగర్తలాలో విలేకరుల సమావేశంలో నడ్డా మాట్లాడుతూ కుంభకోణం నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి కేజ్రీవాల్ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. 'మద్యం కుంభకోణం, మద్యం విధానం గురించి అతన్ని అడిగినప్పుడల్లా, అతను ప్రశ్నలను తప్పించుకుంటాడు. కొన్నిసార్లు కేజ్రీవాల్ తన నేతలను జైలుకు పంపేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, కొన్నిసార్లు ఆప్ నేతలను వేధిస్తున్నారని, కొన్నిసార్లు ఇంకేదో మాట్లాడుతున్నారు' అని నడ్డా తెలిపారు.

చిన్న పార్టీలను తొక్కేస్తోంది

బీజేపీపై శరద్‌పవార్ మండిపాటు

ముంబై: శరద్ పవార్ నుంచి నేర్చుకొని రాజకీయాల్లోకి వచ్చానంటూ ప్రధాని నరేంద్రమోదీ చేసిన వ్యాఖ్యలపై ఎన్‌సీపీ అధినేత వ్యంగ్యంగా స్పందించారు. కొంతమంది విలేకర్లు మంగళవారం శరద్‌పవార్ వద్దకు వెళ్లి మోదీ వ్యాఖ్యలపై వివరణ కోరారు. దీనికి ఆయన స్పందిస్తూ 'ఇంత మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని నాకు తెలియదు' అని వ్యాఖ్యానించారు. 'శరద్ పవార్ వేలు పట్టుకొని రాజకీయాల్లో ముందుకొచ్చాను' అని మోదీ వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. పవార్ విలేకర్లతో మాట్లాడుతూ కేంద్ర దర్యాప్తు సంస్థలను వాడుకొని చిన్న పార్టీలను అధికారానికి దూరం చేస్తోందని బీజేపీపై మండిపడ్డారు. ప్రస్తుతం ఈ వయస్సులో తాను మరే బాధ్యతలు స్వీకరించే పరిస్థితి లేదని వెల్లడించారు. 2024లో ప్రతిపక్షాల ప్రధాని అభ్యర్థిగా నిలబడే విషయంపై ఆయన అనాసక్తి వ్యక్తం చేశారు. బీజేపీకి వ్యతిరేకంగా బీజేపీయేతర పక్షాలు ప్రజాభిప్రాయం నిర్మించేందుకు సాయం చేస్తానని శరద్ పవార్ వివరించారు. 2014లో అధికారంలోకి వచ్చేందుకు చేసిన వాగ్దానాలను నిలబెట్టుకోవడంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విఫలమైందని ఆయన విమర్శించారు. అచ్ఛేదిన్, గ్రామాల అనుసంధానత, ఇంటర్నెట్, మరుగుదొడ్లు, నీటి సరఫరా, ప్రతి ఇంటికీ విద్యుత్తు వంటి వాటిలో నిరాశే ఎదురైందన్నారు.

మహారాష్ట్రలో ఆత్మహత్యలు అధికం

సగం కేసులు ఆ ఐదు రాష్ట్రాల్లోనే: ఎన్‌సీఆర్బీ

న్యూఢిల్లీ: దేశంలో మొత్తం ఆత్మహత్యల్లో అత్యధికంగా మహారాష్ట్రలోనే నమోదయ్యాయి. దేశవ్యాప్తంగా గత ఏడాది లక్షా 64వేల మంది బలవంతంగా ప్రాణాలు తీసుకోగా అందులో 22వేలు మహారాష్ట్రలోనే ఉన్నాయి. తమిళనాడు, మధ్యప్రదేశ్ రాష్ట్రాలు తర్వాతి స్థానాల్లో నిలిచాయి. 2021లో దేశంలో చోటుచేసుకున్న మొత్తం బలవన్మరణాల్లో యాభై శాతానికి పైగా ఐదు రాష్ట్రాల్లోనే ఉన్నట్లు నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో నివేదిక వెల్లడించింది.

2021లో దేశవ్యాప్తంగా 1,64,033 ఆత్మహత్యలు నమోదయ్యాయి. అంతకుముందు ఏడాదితో పోలిస్తే 7.2శాతం పెరిగాయి. మొత్తం కేసుల్లో అత్యధికంగా 22,207 ఆత్మహత్యలు మహారాష్ట్రలోనే (13.5శాతం) చోటుచేసుకున్నాయి. తమిళనాడులో 18,925 (11.5శాతం), మధ్యప్రదేశ్‌లో 14,965 (9.1శాతం), పశ్చిమబెంగాల్‌లో 13,500 (8.2శాతం), కర్ణాటకలో 13,056 (8.1శాతం) బలవన్మరణాలు సంభవించాయి. దేశంలో ఆ ఏడాది నమోదైన ఆత్మహత్యల్లో ఈ ఐదు రాష్ట్రాల్లోనే 50.4శాతం ఉన్నాయి. మిగతా 49.5శాతం ఆత్మహత్యలు మిగిలిన 23 రాష్ట్రాలు, ఎనిమిది కేంద్రపాలిత ప్రాంతాల్లో చోటుచేసుకున్నాయి. దేశ జనాభాలో 16.9శాతం ఉన్న ఉత్తరప్రదేశ్‌లో.. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఆత్మహత్యలు తక్కువగానే నమోదయ్యాయి. గతేడాది మొత్తం మరణాల్లో 3.6శాతం అక్కడ రికార్డయ్యాయి. కేంద్రపాలిత ప్రాంతాల్లో చూస్తే ఢిల్లీలో అత్యధికంగా 2840 ఆత్మహత్యలు నమోదుకాగా పుదుచ్చేరిలో 504 మంది చనిపోయారు. దేశంలోని 53 నగరాల్లో మొత్తం 25,891 మంది ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ప్రతి లక్ష జనాభాకు చోటు చేసుకునే బలవన్మరణాలను సూసైడ్ రేట్ గా పరిగణిస్తారు. 2021లో భారత్‌లో ఈ రేటు 12గా నమోదైంది.

అండమాన్ నికోబార్‌లో ఆత్మహత్యల రేటు అత్యధికంగా 39.7శాతం ఉండగా.. సిక్కింలో 39.2శాతం, పుదుచ్చేరిలో 31.8శాతం, తెలంగాణలో 26.9శాతం, కేరళలో 26.9శాతంగా ఉన్నట్లు ఎన్‌సీఆర్‌బీ నివేదిక వెల్లడించింది. వృత్తిపరమైన సమస్యలు, ఒంటరితనం, దాడులు, హింస, కుటుంబ సమస్యలు, మానసిక రుగ్మతలు, మద్యానికి బానిస కావడం, ఆర్థికంగా నష్టపోవడం, దీర్ఘకాలిక నొప్పులు వంటి సమస్యలు దేశంలో అత్యధిక బలవన్మరణాలకు కారణమవుతున్నట్లు ఎన్‌సీఆర్‌బీ నివేదిక వెల్లడించింది.

మోదీవి తప్పుడు విధానాలు

- అందువల్లే ద్రవ్యోల్బణం, నిరుద్యోగం పెరుగుదల
- కాంగ్రెస్ ధ్వజం
- 4న ఢిల్లీలో 'హల్లా బోల్ మహార్యాలీ'

చండీగఢ్: కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వ తప్పుడు విధానాల కారణంగానే దేశంలో ద్రవ్యోల్బణం, నిరుద్యోగం పెరిగిపోయిందని కాంగ్రెస్ నాయకురాలు శోభా ఓజా సోమవారం ఆరోపించారు. 'ప్రజలు ఇప్పుడు 'బహుత్ హుయ్ మెహంగై కి మార్, పలత్ దో మోదీ సర్కార్' (ద్రవ్యోల్బణం చాలా ఎక్కువ, మోదీ ప్రభుత్వాన్ని తొలగించండి) అని అంటున్నారు' అని ఓజా ఇక్కడ విలేకరులతో అన్నారు. 2014కు ముందు ద్రవ్యోల్బణం వంటి సమస్యలపై గళం విప్పిన ప్రధాని సహా బీజేపీ నేతలు ఇప్పుడు గత ఎనిమిదేళ్లుగా పూర్తి మౌనం పాటించారని ఆమె అన్నారు. పెట్రోల్, డీజిల్, సీఎన్‌జీ, ఆహారం, ఇతర నిత్యావసర వస్తువుల ధరలు సామాన్యులకు అందనంతగా ఉన్నాయని ఓజా అన్నారు. 'దాల్-రోటీ' కూడా ప్రియమైంది, పప్పులు, పిండి, ఉప్పు ధరలు కూడా బాగా పెరిగాయి. ఇప్పుడు, సామాన్య ప్రజలు వినియోగించే దాదాపు అన్ని వస్తువులపై జీఎస్‌టీని విధించారు. పాలు, పెరుగు, మందులు, పెన్సిల్, షార్పనర్ వంటి వస్తువులను కూడా వదిలిపెట్టలేదు' అని ఆమె తెలిపారు. కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ హయాంలో 2014లో రూ.410 ఉన్న వంటగ్యాస్ సిలిండర్ ఇప్పుడు రూ.1,053గా ఉందని ఓజా చెప్పారు. లీటరుకు రూ.70 ఉన్న పెట్రోలు ఇప్పుడు లీటరుకు రూ. 100 కంటే ఎక్కువగా ఉండగా, డీజిల్ ఇప్పుడు లీటరుకు రూ.57 నుంచి రూ.95కి పెరిగింది. వంట నూనె ధరలు లీటరుకు రూ.90 నుంచి రూ.200కి రెట్టింపు అయ్యాయి, గతంలో కిలో రూ.20 ఉన్న పిండి ఇప్పుడు కిలో రూ.35-40 మధ్యలో విక్రయిస్తున్నారు. పాల ధరలు రూ.30 నుంచి రూ.60కి రెట్టింపు అయ్యాయి. ఇక కూరగాయల ధరలు 35 శాతం పెరిగాయి' అని కాంగ్రెస్ నాయకురాలు అన్నారు. 'గత యూపీఏ హయాంలో అనుసరించిన మంచి ఆర్థిక విధానాల కారణంగా, 27 కోట్ల మంది ప్రజలు పేదరికం నుంచి విముక్తి పొందారు. కానీ బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వ హయాంలో 23 కోట్ల మంది భారతీయులు దారిద్ర్యరేఖకు దిగువకు నెట్టబడ్డారు' అని ఆమె ఆరోపించారు. ఒకవైపు ధరలు భారీగా పెరిగిపోతుంటే మరోవైపు నిరుద్యోగం అనేక రెట్లు పెరిగిపోయిందని ఓజా అన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే తమ ప్రభుత్వం ఏటా 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని నరేంద్ర మోదీ హామీ ఇచ్చారు. కానీ ఇప్పుడు 14 కోట్ల మంది నిరుద్యోగులుగా ఉన్నారు. 20-24 సంవత్సరాల మధ్య వయస్సు గల వారు 42 శాతం మంది నిరుద్యోగులుగా ఉన్నారు. వారు ఆలోచించకుండా పెద్ద నోట్ల రద్దు ఫలితంగా 2.30 లక్షల చిన్న యూనిట్లు మూతపడ్డాయని ఆమె ఆరోపించారు. 'ప్రభుత్వరంగ సంస్థలు (పీఎస్‌యూలు) వారి స్వంత ఇష్టమైన వారికి విక్రయిస్తున్నారు. ఇది పేదల ప్రభుత్వం కాదు. పెట్టుబడిదారుల ప్రభుత్వం. పెట్టుబడిదారులకు రూ.11 లక్షల కోట్ల రుణమాఫీ చేశారు' అని ఆమె అన్నారు. కాంగ్రెస్ పార్టీ సామాన్య ప్రజలకు సంబంధించిన వీటిని, ఇతర సమస్యలను వీధుల నుంచి పార్లమెంటు వరకు లేవనెత్తుతుందని ఓజా తెలిపారు. పెరుగుతున్న ద్రవ్యోల్బణం, నిరుద్యోగానికి వ్యతిరేకంగా సెప్టెంబర్ 4న ఢిల్లీలోని రాంలీలా మైదాన్‌లో తమ పార్టీ 'హల్లా బోల్ మహార్యాలీ' నిర్వహిస్తోందని చెప్పారు.

ఆఫీసుకెళ్లి దూషించడం క్రూరత్వమే: చత్తీస్‌గఢ్ హైకోర్టు



బిలాస్‌పూర్: భర్త పనిచేసే ఆఫీసుకెళ్లి భార్య అతన్ని అసభ్య పదజాలంతో దూషించడం క్రూరత్వమే అవుతుందని చత్తీస్‌గఢ్ హైకోర్టు అభిప్రాయపడింది. ఓ విడాకుల కేసులో కింది కోర్టు ఇచ్చిన తీర్పును సమర్థిస్తూ హైకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. ఈ కేసుకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. ధంతరి జిల్లాకు చెందిన ఓ ప్రభుత్వ ఉద్యోగి(32)కి రారుపూర్‌కి చెందిన ఓ మహిళతో వివాహమైంది. పెళ్లైన కొంతకాలానికే భార్యాభర్తల మధ్య మనస్పర్థలు తలెత్తాయి. దీంతో భార్య నుంచి విడాకులు కోసం భర్త రాయపూర్ ఫ్యామిలీ కోర్టును ఆశ్రయించాడు. భార్య రోజూ తనని వేధిస్తుందని.. ఆఖరికి తన తల్లి దండ్రుల్ని కూడా కలుసుకోనివ్వట్లేదని అతను విడాకుల దరఖాస్తులో పేర్కొన్నాడు. ఈ కేసులో వాదనలు విన్న అనంతరం 2019 డిసెంబర్‌లో రాయాపూర్ ఫ్యామిలీ కోర్టు వీరికి విడాకులు మంజూరు చేసింది. రారుపూర్ ఫ్యామిలీ కోర్టు తీర్పును సవాల్ చేస్తూ.. అతని భార్య హైకోర్టును ఆశ్రయించింది. తన నుంచి విడాకులు పొందేందుకు భర్త తప్పుడు సాక్ష్యాలు చూపించాడని, ఆ ఉత్తర్వులపై జోక్యం చేసుకోవాలని పిటిషన్ దాఖలు చేసింది. అయితే ఆమె చేసిన ఆరోపణల్ని భర్త తోసిపుచ్చాడు. తనకు వివాహేతర సంబంధం ఉందని భార్య చేసిన తప్పుడు ఆరోపణల కారణంగా తన పరువుకు భంగం కలిగిందని హైకోర్టుకు తెలిపాడు. కేవలం వివాహేతర సంబంధం అంటగట్టడమే కాకుండా.. తన భార్య తాను పనిచేసే ఆఫీసుకు వచ్చి తనను అసభ్య పదజాలంతో దూషించిందని, తనను మరోచోటుకు బదిలీ చేయించేందుకు ముఖ్యమంత్రికి లేఖ రాసిందని ఆయన కోర్టుకు తెలిపాడు. రెండుపక్షాల వాదనలు విన్న హైకోర్టు.. రాయపూర్ ఫ్యామిలీ కోర్టు మంజూరు చేసిన విడాకులను సమర్థించింది. ఈ సందర్భంగా న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. 'ఈ కేసులో సాక్ష్యాధారాలను పరిశీలించిన తర్వాత భర్తకు వివాహేతర సంబంధం ఉందని భార్య చేసిన ఆరోపణలు అవాస్తవమని తేలింది.

ఈ తప్పుడు ఆరోపణలతో ఆ భార్య.. భర్త పనిచేసే ఆఫీసుకు వెళ్లి అక్కడ తన సహోద్యోగుల ముందు అతడిని దూషించడం, అతని పరువు తీసేలా ప్రవర్తించడం క్రూరత్వమే అవుతుంది. భర్త తన తల్లిదండ్రుల్ని కలుసుకోకుండా వేధించడం, అక్రమ సంబంధం నిందలు వేసి అతడిని బదిలీ చేయాలని కోరడం తీవ్రమైన విషయమే. అందుకే ఆ భార్య నుంచి విడాకులు మంజూరు చేస్తూ.. రారుపూర్ కోర్టు ఇచ్చిన ఆదేశాలను సమర్థిస్తున్నాం' అని హైకోర్టు స్పష్టం చేసింది.

ఆజాద్ కొత్త పార్టీ!

లౌకిక శక్తుల ఐక్యతకు కృషి

జమ్ము మాజీ ఉపముఖ్యమంత్రి తారాచంద్



జమ్ము: జమ్ముకశ్మీర్‌లో వచ్చే అసెంబ్లీ ఎన్నికలనాటికి గులాం నబీ ఆజాద్ నేతృత్వంలో ఏర్పాటు కానున్న కొత్త పార్టీ జాతీయ రాజకీయాల్లో క్రియాశీలక పాత్ర పోషిస్తుందని ఆయన సన్నిహితుడు, జమ్ము మాజీ ఉపముఖ్యమంత్రి తారాచంద్ మంగళవారం విలేకరుల సమావేశంలో అన్నారు. కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన ఆజాద్ నేతృత్వంలో త్వరలోనే ఒక జాతీయ పార్టీ ప్రారంభమవుతుందని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని లౌకిక పార్టీలను ఒకే వేదికపైకి తీసుకురావడానికి తాము ప్రయత్నిస్తామని చెప్పారు. ఈ వేదిక ద్వారా బీజేపీ ప్రభుత్వం రద్దు చేసిన ఆర్టికల్ 370, రాష్ట్ర హోదా సహా ఇతర హక్కుల పునరుద్ధరణకు కృషి చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలకు సుపరిపాలన అందించడానికి ప్రతిపక్షాలతో కలసి బలమైన కూటమిని తయారుచేయడానికి ప్రయత్నిస్తామని చెప్పారు. బీజేపీతోనూ పొత్తులు పెట్టుకుంటారా అని విలేకరులు అడిగిన ప్రశ్నకు స్పందించిన తారా చంద్ అటువంటి అవకాశం లేదని తేల్చి చెప్పారు. కాంగ్రెస్‌ను వీడినా తాము ఏర్పాటు చేస్తున్న పార్టీ లౌకికవాద పార్టీగానే ఉంటుందని తెలిపారు. ఎన్నికల్లో కలసి వచ్చే లౌకికవాద పార్టీలతో మాత్రమే పొత్తులుంటాయని స్పష్టం చేశారు. బీజేపీకి ఆజాద్ బీ టీం అని వస్తున్న ఆరోపణల్ని తోసిపుచ్చారు. తమకు బీజేపీతో ఎలాంటి సంబంధం లేదని నొక్కిచెప్పారు. గత కొన్నేళ్లుగా కాంగ్రెస్ పార్టీ తమను విస్మరించిందని, తమ ఆలోచనల్ని పట్టించుకోలేదని చెప్పారు. నరేంద్ర మోదీ పాలనా వైఫల్యాలపై పోరాడడంలోనూ కాంగ్రెస్ పార్టీ పూర్తిగా విఫలమైందని అన్నారు. ఈ నేపథ్యంలోనే పార్టీకి రాజీనామా చేయాలని తాము నిర్ణయం తీసుకోవలసి వచ్చిందని వివరించారు. 2005 నుంచి 2008 వరకు ఆజాద్ సాగించిన పాలన స్వర్ణయుగం అన్నారు. పరిపాలనలో అనుభవజ్ఞుడైన నేత అవసరమని రాష్ట్ర ప్రజలు భావిస్తున్నారని చెప్పారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ నుంచి చాలా మంది సీనియర్ నేతలు బయటకు వస్తారని అన్నారు. ఇతర పార్టీల నేతలు కూడా తమతో చేతులు కలిపేందుకు ఆసక్తి చూపుతున్నట్లు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన అనంతరం ఆజాద్ మాట్లాడుతూ...కేంద్ర ప్రభుత్వం 2019 ఆగస్టు 5న రద్దు చేసిన ఆర్టికల్ 370, ప్రత్యేక రాష్ట్ర హోదా, రాజ్యాంగం ప్రకారం తమకు దక్కాల్సిన హక్కుల కోసం పోరాడనున్నట్లు చెప్పిన విషయం విధితమే.

5న తమిళనాడు పర్యటనకు కేజ్రీవాల్

న్యూఢిల్లీ: ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సెప్టెంబరు 5న తమిళనాడులో పర్యటించనున్నారు. ప్రభుత్వం ఆహ్వానం మేరకు రాష్ట్రంలో అత్యున్నత ప్రమాణాలతో ఏర్పాటు చేసిన పాఠశాలలు సహా మూడు ప్రాజెక్టులను ప్రారంభించను న్నట్టు మంగళవారం కేజ్రీవాల్ ట్వీట్ చేశారు. ఢిల్లీలో తమ ప్రభుత్వం నిర్వహిస్తున్న పాఠశాలలను ఆదర్శంగా తీసుకుని ఏర్పాటు చేసిన ప్రాజెక్టులను ప్రారంభించడానికి తనను ఆహ్వానించిన తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ ట్వీట్ చేశారు. విద్యా విప్లవం వైపు అడుగులు వేస్తోన్న తమిళనాడు ప్రజలతో కలిసి ప్రయాణించే అవకాశం రావడం ఆనందంగా ఉందన్నారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో సీఎం స్టాలిన్ ఢిల్లీ ప్రభుత్వం నిర్వహిస్తున్న పాఠశాలలను సందర్శించి రాష్ట్ర ప్రభుత్వం విద్యావ్యవస్థలో వచ్చిన మార్పులను అధికారులను అడిగి తెలుసుకున్నట్టు తెలిపారు.

లోకాయుక్త బిల్లుకు కేరళ అసెంబ్లీ ఆమోదం

యూడీఎఫ్ వ్యతిరేకం - అసెంబ్లీ కార్యకలాపాల బహిష్కరణ

తిరువనంతపురం : లోకాయుక్త (సవరణ) బిల్లుకు కేరళ అసెంబ్లీ ఆమోదం లభించింది. విపక్ష కాంగ్రెస్ నేతృత్వ యూడీఎఫ్‌కు పాలక పక్షానికి మధ్య గంటల తరబడి సాగిన వాగ్వాదం అనంతరం ఈ బిల్లును శాసనసభ ఆమోదించింది. ఓటింగ్‌ను యూడీఎఫ్ బహిష్కరించినా బిల్లుకు ఆమోదం లభించింది. అసెంబ్లీలో ప్రతిపక్ష నేత వీడీ శతీషన్ మాట్లాడుతూ, 'రాష్ట్ర అసెంబ్లీ చరిత్రలోనే ఇది బ్లాక్ డే. అవినీతి వ్యతిరేక వ్యవస్థ ఖూనీకి యూడీఎఫ్ సాక్షిగా ఉండబోదు. అవినీతి వ్యతిరేక వ్యవస్థను బలహీనపర్చడానికి, అంతం చేయడానికి ప్రభుత్వం చేసిన ప్రయత్నానికి మద్దతివ్వదు. ఈ బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. చివరి వరకు పోరాడతాం' అని అన్నారు. శాసనసభ కార్యకలాపాలను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. ఈ బిల్లును ఆమోదిస్తే ముఖ్యమంత్రికి సంబంధించిన కేసులో లోకాయుక్త వెలువరించిన తీర్పుపై నిర్ణయాన్ని అసెంబ్లీ ఎలా తీసుకుంటుందని విపక్షం ప్రశ్నించింది. అంతకుముందు కాంగ్రెస్ శాసనసభ్యులు రమేశ్ చెన్నితల, పీసీ విష్ణునాథ్ ఈ బిల్లుకు కొత్త సవరణలపై ప్రశ్నలు లేవనెత్తారు. నిబంధనలకు వ్యతిరేకంగా గతవారం దీనిని సబ్జెక్ట్ కమిటీకి పంపారన్నారు. కానీ వారి వాదనలను స్పీకర్ ఎంబీ రాజేశ్ తోసిపుచ్చారు. న్యాయ మంత్రి పిరాజీవ్ కూడా ప్రతిపక్ష వాదనను తోసిపుచ్చుతూ బిల్లులో మార్పులు చేసే అధికారం సబ్జెక్ట్ కమిటీకి ఉందని అన్నారు.

రేపు తీస్తా బెయిల్‌పై సుప్రీం విచారణ

న్యూఢిల్లీ : గుజరాత్ అల్లర్ల కేసులో 'అమాయకుల'ను తప్పుడు సాక్ష్యాలతో ఇరికించే ప్రయత్నం చేశారన్న ఆరోపణలతో అరెస్టు అయిన కార్యకర్త తీస్తా సెతల్వాడ్‌కు బెయిల్ పిటిషన్‌పై గురువారం సుప్రీంకోర్టు విచారించనుంది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉదయ్ ఉమేశ్ లలిత్, జస్టిస్ ఎస్ రవీంద్రభట్, జస్టిస్ సుధాంషు ధూలియాతో కూడిన ధర్మాసనం మంగళవారం మధ్యాహ్నం 3.45 గంటలకు కేసును విచారించాల్సి ఉండగా, సరిపడ సమయం లేని కారణంగా సెప్టెంబరు 1వ తేదీకి విచారణను వాయిదా వేశారు. గురువారం మధ్యాహ్నం 3 గంటలకు ఈ కేసును విచారిస్తామని ధర్మాసనం పేర్కొంది. బెయిల్ పిటిషన్‌పై గుజరాత్ ప్రభుత్వం స్పందిస్తూ 'సీనియర్ రాజకీయ నేత తరపున ఇతర నిందితులతో కలిసి కుట్రలో కార్యకర్త తీస్తా భాగస్వామి అయ్యారు' అని ఆరోపించింది. సంబంధిత నేతతో అనేక మార్లు తీస్తా సెతల్వాడ్ సమావేశమై పెద్ద మొత్తాల్లో డబ్బు పొందినట్లు అఫిడవిట్‌లో పేర్కొంది. ప్రత్యేక దర్యాప్తు బృందం అధిపతి (సిట్) ద్వారా ఈ అఫిడవిట్ దాఖలు అయింది.

సుప్రీంలో నల్లధనంపై కేసు విచారణ వాయిదా

న్యూఢిల్లీ : విదేశీ బ్యాంకుల్లో మగ్గుతున్న నల్లధనాన్ని తిరిగి తెచ్చేందుకు తీసుకోవాల్సిన చర్యలను కోరుతూ దాఖలైన పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. 2009లో సీనియర్ న్యాయవాది, కీశే రాం జత్మలానీ ఈ పిటిషన్ వేశారు. పిటిషనర్ల తరపున న్యాయవాది కొంత సమయం కావాలని కోర్టును కోరగా జస్టిస్ ఎస్ఏ నజీర్, జస్టిస్ ఏఎస్ బొప్పన్న, జస్టిస్ వి.రామ సుబ్రమణ్యన్‌తో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఈ కేసును వాయిదా వేస్తున్నట్లు పేర్కొంది. జత్మలానీ, పంజాబ్ మాజీ డీజీపీ కేపీఎస్ గిల్‌తో సహా మరో ఐదుగురు ఈ పిటిషన్ వేశారు. గిల్, జత్మలానీ ప్రాణాలతో లేరు. నల్ల దనాన్ని తిరిగి తేవడానికి ఎలాంటి చర్యలను ప్రభుత్వం తీసుకోవడం లేదని లోక్‌సభ మాజీ ప్రధాన కార్యదర్శి సుభాష్ కశ్యప్ పిటిషన్‌లో ఆరోపించారు. విదేశీ బ్యాంకుల్లో ఉన్న నల్ల ధనానికి సంబంధించిన కీలక పత్రాలను ఇవ్వకుండా విచారణకు ప్రభుత్వం సహకరించడం లేదు అని ఆరోపణలు చేశారు.

ఆప్ ప్రభుత్వంపై బీజేపీ ఎదురుదాడి

న్యూఢిల్లీ: ఢిల్లీలోని ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వంపై విమర్శలను బీజేపీ మంగళవారం మరింత తీవ్రతరం చేసింది. ఆప్ చెప్పుకునే అభివృద్ధి మోడల్‌ను 'రివర్స్ రాబిన్‌హుడ్' మోడల్‌గా పేర్కొంది. మద్యం, విద్య కుంభకోణాలు కేజ్రీవాల్ ప్రభుత్వ అవినీతికి ట్విన్ టవర్లని విమర్శించింది. తరగతిగదులకయ్యే ఖర్చును ప్రభుత్వం అనేక రెట్లు పెంచి చూపించిందని, తమ చర్యను సమర్థించుకునేందుకు స్కూళ్లలోని అనేక మరుగుదొడ్లను తరగతి గదులుగా చూపిస్తోందని ఆరోపించింది.

కల్యాణ్ సింగ్‌పై బాబ్రీ మసీదు కూల్చివేత కేసు ఎత్తివేత

న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్ మాజీ సీఎం, దివంగత కల్యాణ్ సింగ్‌పై బాబ్రీ మసీదు కూల్చివేత కేసును సుప్రీంకోర్టు ఎత్తివేసింది. అయోధ్యలోని బాబ్రీ మసీదు కూల్చివేత కేసులో మాజీ సీఎం కల్యాణ్ సింగ్ తదితరులపై దాఖలైన ధిక్కార కేసును సుప్రీంకోర్టు ముగించింది. కల్యాణ్ సింగ్ మరణాన్ని ఉటంకిస్తూ బాబ్రీ మసీదు కూల్చివేత కేసులో ఆయనపై కోర్టు ధిక్కారానికి సంబంధించిన కేసును సుప్రీం ఎత్తివేసింది. 2019 అయోధ్య తీర్పు నేపథ్యంలో ఈ కేసు అంశం మనుగడలో లేదని సుప్రీం పేర్కొంది. యూపీ ప్రభుత్వం భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చినప్పటికీ, రథయాత్ర, బాబ్రీ కూల్చివేతలను సర్కారు అనుమతించినందున కల్యాణ్ సింగ్, ఇతరులపై ధిక్కార కేసు పెట్టారు. మాజీ సీఎం మరణించినందువల్ల ఈ కేసును మూసివేసింది. అయోధ్య తీర్పు వల్ల బాబ్రీ మసీదు కూల్చివేత వల్ల ఉత్పన్నమయ్యే ఇతర కేసులు దీనివల్ల ప్రభావితం కావు.

పాకిస్తాన్‌కు భారత్ ఆహార సాయం?

న్యూఢిల్లీ: వరదల్లో చిక్కుకొన్న పాకిస్తాన్‌కు భారత్ నుంచి ఆహార పదార్థాలను సాయంగా పంపే అవకాశం ఉంది. ఇప్పటికే భారత్ నుంచి కూరగాయలు, ఇతర సరుకులు దిగుమతి చేసుకొనే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు పాక్ మంత్రి ముఫ్తీ ఇస్మాయిలీ తెలిపారు. దీనికి సంబంధించి అత్యున్నత స్థాయిలో చర్చలు జరిగాయి. కానీ, నిర్ణయం మాత్రం తీసుకోలేదు. అయితే పాకిస్తాన్ నుంచి ఇప్పటి వరకు అధికారికంగా ఎటువంటి అభ్యర్థన రాలేదు. పాకిస్తాన్‌లో వరదల తీవ్రత ఏ మాత్రం తగ్గుముఖం పట్టలేదు. 1,000 మందికిపైగా చనిపోగా.. 10 బిలియన్ డాలర్లకు పైగా ఆస్తినష్టం వాటిల్లింది. చాలా జిల్లాలు సముద్రంలో కలిసిపోయాయా అన్నట్లు పరిస్థితి ఉందని పాక్‌మంత్రి షెర్రీ రెహ్మాన్ పేర్కొన్నారు. హెలికాప్టర్ల నుంచి సాయం జారవిడిచేందుకు సైతం పొడినేల కనిపించడం లేదని వెల్లడించారు. తొలిసారి సహాయక చర్యల కోసం పాక్ నౌకాదళాన్ని రంగంలోకి దింపింది. భారత ప్రధాని నరేంద్ర మోదీ కూడా పాకిస్తాన్ వరదల్లో ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాపం తెలిపారు. ఈ నేపథ్యంలో ఒకవేళ పాక్ నుంచి అభ్యర్థన వస్తే భారత్ సానుకూలంగా స్పందిస్తుందని అంచనాలు ఉన్నాయి. ప్రస్తుత వరదల దెబ్బకు పాకిస్తాన్‌లో ద్రవ్యోల్బణం భారీగా పెరిగిపోయింది. 2019లో కశ్మీర్‌లో ఆర్టికల్ 370ని తొలగించడంతో భారత్‌తో వ్యాపారాన్ని పాకిస్తాన్ నిలిపివేసింది. భారత్‌తో దౌత్య సంబంధాల స్థాయిని కూడా తగ్గించుకొంది.

అదే నా అఖరి పోరాటం: మమత



కోల్‌కతా : పశ్చిమ బెంగాల్‌ను కాపాడుకోవడానికి మొదటి ప్రాధాన్యత ఇస్తామని, వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వాన్ని కూల్చివేయడమే తన ఆఖరి పోరాటం అని టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ స్పష్టంచేశారు. మమ్మల్ని భయపెడితే విరుచుకు పడతామని కమలం దళానికి పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి హెచ్చరించారు. '2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలి. కాషాయ పార్టీని గద్దెదించడమే ఢిల్లీ కోసం నేను చేసే చివరి పోరాటం. బీజేపీకి అధికారం లేకుండా చేస్తానని హామీనిస్తున్నా' అని ఓ ర్యాలీలో మమత ఉద్ఘాటించారు. ఎట్టిపరిస్థితుల్లోనూ ఇది జరిగి తీరాల్సిందేనని అన్నారు. 1984లో 400కుపైగా స్థానాల్లో గెలిచినా 1989లో రాజీవ్ గాంధీ ఓడిపోవడాన్ని ఆమె గుర్తుచేశారు. ఓటమి నుంచి ఎవరూ తప్పించుకోలేరన్నారు. 'ఇందిరాగాంధీ శక్తిమంతమైన రాజకీయ నాయకురాలైనాగానీ ఆమెకు ఓటమి తప్పలేదు. బీజేపీకి 300 మంది ఎంపీలు ఉన్నారుగానీ బీహార్ దక్కలేదు. ఇంకా చాలా వాటిని ఆ పార్టీ కోల్పోనుంది. ఎన్నికలకు ముందు వారి వద్ద ఒక్క నాయకుడూ ఉండదు' అని మమతా బెనర్జీ అన్నారు. మమతా బెనర్జీ 'ఆఖరి పోరాటం' వ్యాఖ్యలపై బీజేపీ స్పందించింది. లోక్ సభ ఎన్నికల తర్వాత ఆమె తన బూట్లను వేలాడదీసుకోవాల్సిందే' అని వ్యాఖ్యానించింది. వరుసగా మూడవసారి బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ అధికార ప్రతినిధి సామిక్ భట్టాచార్య దీమాగా చెప్పారు.

సవరణలు

- నిన్న అనగా 29-8-2022వ తేదీన ప్రచురించబడిన సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులుగా ఎన్నికైన వారి పేర్లలో పీజే చంద్రశేఖరరావు, ఆహ్వానితుల పేర్లలో శీలం వెంకటసుబ్బయ్య, కలిశెట్టి వెంకట్రావు (పశ్చిమగోదావరి) పేర్లు రాలేదు. ఆ ముగ్గురు ఎన్నికైన వారిలో ఉన్నారు.
- సీపీఐ 24వ జాతీయ మహాసభల లోగో విజేత యడ్ల చేతిన్‌కు బహుమతిగా రూ.5 వేలు ఆహ్వానసంఘం వారు ఇచ్చినట్లు పొరపాటుగా ప్రచురించబడింది. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.రామచంద్రయ్య తాను వ్యక్తిగతంగా విజేతకు బహుకరించటమైనది.
- ఎస్ ఎన్ రసూల్, మునెప్ప, భాగ్యలక్ష్మి పేర్లకు పొరపాటున కర్నూలు జిల్లాకు బదులుగా కడప జిల్లాగా ప్రచురించబడినది. పొరపాటుకు చింతిస్తున్నాము...

బీజేపీ సర్కార్‌కు మద్దతు ఉపసంహరణ

మణిపూర్ జేడీయూ ప్రకటన

ఇంఫాల్: మణిపూర్‌లో నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ నుంచి బయటకు రాబోతున్నట్లు ఆ రాష్ట్ర జేడీయూ ప్రకటించింది. బీజేపీ ప్రభుత్వానికి మద్దతు సైతం ఉపసంహరించుకోబోతున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు జేడీ(యూ) మణిపూర్ శాఖ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కేఎస్‌హెచ్ బీరెన్ సింగ్ ప్రకటన చేశారు. 'మద్దతు ఉపసంహరించుకునే ప్రయత్నాల్లో ఉన్నాం. కానీ, కొన్ని అంశాలపై మాట్లాడుకోవాల్సి ఉంది' అని బీరెన్ స్పష్టం చేశారు. సెప్టెంబర్ 3-4 తేదీల మధ్య పాట్నాలో జరగబోయే జేడీయూ కార్యవర్గ సమావేశంలో స్పష్టమైన నిర్ణయం తీసుకుంటామని, ఈ భేటీకి మణిపూర్ జేడీయూ ఎమ్మెల్యేలు హాజరవుతారని, సమావేశం అనంతరం అధికారికంగా ఒక ప్రకటన చేస్తామని తెలిపారు. ఇదిలా ఉంటే.. బీహార్ రాజకీయాల్లో భాగంగా జేడీ(యూ) ఎన్డీయే కూటమి నుంచి బయటకు వచ్చేసింది. ఆ తర్వాత కేంద్రంతోనూ సంబంధాలు తెంచేసుకుంది. మణిపూర్‌లో

ఎన్ బీరెన్ సింగ్ నేతృత్వంలోని బీజేపీ కూటమి ప్రభుత్వానికి మాత్రం మద్దతు కొనసాగుతూనే వస్తోంది. వాస్తవానికి ఆగస్టు 10వ తేదీనే మణిపూర్ జేడీయూ తెగతెంపులపై అధికారిక ప్రకటన చేయాల్సి ఉంది. అయితే పార్టీ కేంద్ర నాయకత్వం నుంచి ఆమోదం రాకపోవడంతో ప్రకటన జాప్యం అవుతూ వస్తోంది.

మణిపూర్ అసెంబ్లీలో 60 స్థానాలు ఉండగా.. బీజేపీ ప్రభుత్వం 55 మంది ఎమ్మెల్యేలతో కూటమి ప్రభుత్వాన్ని నడిపిస్తోంది. అందులో బీజేపీ ఎమ్మెల్యేలు 32 మంది కాగా, ఏడుగురు నేషనల్ పీపుల్స్ పార్టీకి చెందిన వారు. ఆరుగురు జేడీయూ ఎమ్మెల్యేలు, మిగిలిన వారు ప్రాంతీయ పార్టీల వాళ్లు ఉన్నారు. జేడీయూ మద్దతు ఉపసంహరించుకున్నా ప్రభుత్వం కుప్పకూలే అవకాశం లేదు. అయితే ప్రాంతీయ పార్టీల్లో తాము బీజేపీ-బీ టీములం కాదనే అసంతృప్తి పేరుకుపోయింది. ఒకవేళ జేడీయూ కానీ వాళ్లను ప్రభావితం చేయగలిగితే...ప్రభుత్వం సంక్షోభంలో పడే అవకాశాలు ఉన్నాయి. మరోవైపు.. మణిపూర్ బీజేపీలో నేతల మధ్య అసంతృప్తి పెరిగిపోతోంది. ఈ క్రమంలో కీలక నేత నిమాయ్‌చంద్ లువాంగ్ తన మద్దతుదారులతో కలిసి ఇంఫాల్‌లో జేడీయూ తీర్థం పుచ్చుకున్నారు.

కోర్టు ధిక్కార కేసు...
ప్రశాంత్ భూషణ్‌కు ఊరట



న్యూఢిల్లీ: ప్రముఖ న్యాయవాది ప్రశాంత్ భూషణ్‌పై నమోదైన కోర్టు ధిక్కార అభియోగాలపై విచారణ నిలిపివేయాలని సుప్రీం కోర్టు నిర్ణయించింది. 2009లో తెహల్కా పత్రికతో మాట్లాడుతూ న్యాయవ్యవస్థలో అవినీతిపై చేసిన వ్యాఖ్యలకుగాను ఆయనపై ధిక్కార కేసు నమోదు చేశారు. జస్టిస్ ఇందిరా బెనర్జీ నేతృత్వంలో ముగ్గురు సభ్యుల ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. ఎటువంటి పరిస్థితుల్లో ఆ వ్యాఖ్యలు చేయాల్సివచ్చిందో వివరిస్తూ ప్రశాంత్ భూషణ్ ఇచ్చిన వివరణకు కోర్టు సానుకూలంగా స్పందించింది. ఆయనపై కోర్టు ధిక్కార చర్యలను కొనసాగించాల్సిన అవసరం లేదని ధర్మాసనం అభిప్రాయపడింది. తెహల్కా పత్రిక అధిపతి, జర్నలిస్టు తరుణ్ తేజ్‌పాల్‌పైనా కోర్టు ధిక్కార విచారణను నిలిపివేయాలని ఆదేశించింది. ఈ కేసు విచారణను చివరిసారిగా 2020లో జస్టిస్ అరుణ్ మిశ్రా, ఏఎన్ ఖన్విల్కర్ ధర్మాసనం చేపట్టింది. వీరిద్దరూ పదవీ విరమణ చేశారు. 2009లో తెహల్కా మ్యాగజైన్‌కు ఓ ఇంటర్వ్యూ ఇస్తూ ప్రశాంత్ భూషణ్ న్యాయవ్యవస్థలో అవినీతిపై వ్యాఖ్యలు చేశారు. కొందరు సుప్రీం సీజేలను తప్పుపట్టారు. సుప్రీం ఈ వ్యాఖ్యలను సుమోటోగా తీసుకొని కోర్టు ధిక్కార అభియో గాలు నమోదు చేసింది. దీంతోపాటు తెహల్కా సంపాదకుడు తరుణ్ తేజ్‌పాల్ పేరును కూడా దీనిలో చేర్చింది. వాస్తవానికి ప్రశాంత్ భూషణ్ ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆర్థిక అవినీతినే కాకుండా విస్తృతమైన అంశాలను చేర్చడం కోసం 'అవినీతి' అనే పదాన్ని వాడారు.

ఆ క్రూరుడ్ని కఠినంగా శిక్షించాలి: రాహుల్

న్యూఢిల్లీ: జార్ఖండ్ రాష్ట్రం దుమ్కా జిల్లాలో 12వ తరగతి చదువుతున్న విద్యార్థిని మృతికి కారకుడైన క్రూరుడ్ని కఠినంగా శిక్షించాలని కాంగ్రెస్ నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా డిమాండ్ చేశారు. ప్రేమను నిరాకరించిందన్న కారణంతో నిద్రిస్తున్న యువతిపై పెట్రోలు పోసి నిప్పంటించి దారుణంగా హతమార్చాడు ఓ యువకుడు. ఈ దారుణ సంఘటన ఆగస్ట్ 23న జార్ఖండ్‌లోని దుమ్కా జిల్లాలో జరిగింది. నిందితుడు షారుఖ్, ఆమె నిద్రిస్తున్నప్పుడు ఆమె గది కిటికీ వెలుపలి నుండి పెట్రోల్ పోసి నిప్పంటించాడని పోలీసులు తెలిపారు. రాంచీలోని రాజేంద్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ (రిమ్స్)లో చికిత్స పొందుతున్న విద్యార్థిని ఆదివారం తెల్లవారు జామున మృతి చెందింది. ఇంతటి క్రూరత్వానికి పాల్పడిన నిందితుడికి వీలైనంత త్వరగా కఠిన శిక్ష పడినప్పుడే బాలికకు, ఆమె కుటుంబానికి న్యాయం జరుగుతుందని రాహుల్ అన్నారు. దేశంలో మహిళలకు సురక్షిత వాతావరణాన్ని కల్పించాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు ట్వీట్ చేశారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా ట్విట్టర్ వేదికగా స్పందించారు. జార్ఖండ్‌లో 12వ తరగతి విద్యార్థిని నిర్దాక్షిణ్యంగా హత్య చేసిన ఘటన హృదయాన్ని కలచివేసిందని అన్నారు. నేరస్తులకు వీలైనంత త్వరగా శిక్ష విధించాలి. మహిళలపై దాడులను అరికట్టడానికి ఘటనలు వెంటనే వేగంగా చట్టపరంగా చర్యలను వేగవంతంగా పూర్తి చేసి నిందితులను కఠినంగా శిక్షించాలని పేర్కొన్నారు.

ఫోన్‌లో గొంతు గుర్తుపట్ట లేదని...
కేంద్రమంత్రి ఇరానీ జులుం

లక్నో: ఫోన్ చేసిన కేంద్రమంత్రి గొంతు గుర్తుపట్టకపోవడం వల్ల ఓ అధికారి ఉద్యోగానికే ఎసరు తెచ్చింది. కేంద్ర మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి, ఉత్తరప్రదేశ్‌లోని అమేథీ నియోజకవర్గ ఎంపీ స్మృతి ఇరానీ ఫోన్ చేయగా ఓ శాఖలో పనిచేస్తున్న గుమాస్తా గుర్తించకపోవటంతో ఆయనపై దర్యాప్తునకు ఆదేశించారు. విషయం ఏమిటంటే...అమేథీ లోక్‌సభ నియోజకవర్గంలో స్మృతి ఇరానీ ఆగస్టు 27న పర్యటించారు. అదే సమయంలో ముసఫిరానా తహసీల్‌లోని పూరే పహల్వాన్ గ్రామానికి చెందిన కరుణేశ్(27) అనే వ్యక్తి తన తల్లికి పెన్షన్ మంజూరు కాలేదనే విషయాన్ని కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అందుకు స్థానిక కార్యాలయంలో క్లర్క్ దీపక్ కారణమని పేర్కొన్నారు. పెన్షన్ దరఖాస్తును ఇంకా ఆయన ధ్రువీకరించలేదని తన గోడు వెల్లబోసుకున్నాడు. వెంటనే స్పందించిన స్మృతి ఇరానీ.. ఆ అధికారికి ఫోన్ చేశారు. కానీ, ఆ వ్యక్తి కేంద్రమంత్రి గొంతును గుర్తు

పట్టలేకపోయారు. దీంతో ఆమె పక్కనే ఉన్న జిల్లా ఉన్నతాధికారి ఆ ఫోన్ తీసుకొని క్లర్క్‌తో మాట్లాడారు. వెంటనే కార్యాలయానికి రావాలని స్పష్టం చేశారు. ఈ విషయంపై విచారణ జరపాలని జిల్లా అధికారులకు కేంద్రమంత్రి సూచించారు. కరుణేశ్ ఇచ్చిన ఫిర్యాదును పరిశీలించిన అధికారులు.. క్లర్క్ నిర్లక్ష్యం వహించినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ ఘటనపై ముసఫిరానా సబ్‌డివిజినల్ మేజిస్ట్రేట్ విచారణ జరుపుతారని.. నివేదిక ప్రకారం నిర్లక్ష్యం వహించిన అధికారిపై చర్యలు ఉంటాయని అధికారులు తెలిపారు.

ఈపీఎఫ్‌ఓ కొత్త ప్రతిపాదనలు

న్యూఢిల్లీ: ఎంప్లాయ్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్‌ఓ) శుభవార్త చెప్పింది. ప్రస్తుతం ఉన్న నిబంధనల్ని సవరించనుంది. కొత్త నిబంధనల్ని అమలు చేయనుంది. ఇందుకోసం ఈపీఎఫ్‌ఓ ఈ కొత్త ప్రతిపాదనల్ని తన భాగస్వాములతో పాటు, రాష్ట్ర ప్రభుత్వాల ముందు ఉంచినట్లు సమాచారం. ప్రస్తుతం ఈపీఎఫ్‌ఓలో చేరాలంటే ఒక సంస్థలో 20మందికి పైగా ఉద్యోగులు విధులు నిర్వహిస్తూ..వారి వేతనం రూ.15వేలకు పైగా ఉండాలి. అలా ఉంటేనే చందాదారులుగా చేరే సౌకర్యం ఉంది. అయితే ఈపీఎఫ్‌ఓ మిసిలేనియస్ ప్రావిజన్స్ యాక్ట్ 1952లోని పరిమితుల్ని ఉపసంహరించుకోనుంది. తద్వారా ఈపీఎఫ్‌ఓ తన పథకాలను బిజినెస్ చేసుకునే వారికి సైతం అందించే సౌలభ్యాన్ని కల్పించనుంది. దీంతో పాటు ఈపీఎఫ్‌ఓలో చేరేందుకు ఇప్పటి వరకు విధించిన హెడ్ కౌంట్ (20మంది ఉద్యోగులు) ఉండాలన్న నిబంధనల్ని తొలగించేలా ప్రతిపాదనలు పెడుతున్నట్లు తెలుస్తోంది. కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ పరిధిలో ఈపీఎఫ్‌ఓ కార్యకలాపాలు నిర్వహిస్తుంది. ఇందులో ప్రస్తుతం ఈపీఎఫ్‌ఓ తన ఖాతాదారులకు ఉద్యోగుల డిపాజిట్ లింక్డ్ ఇన్సూరెన్స్ స్కీమ్ ద్వారా ప్రావిడెంట్ ఫండ్, పెన్షన్, బీమా ప్రయోజనాలు అందిస్తుంది. 2022 మార్చి నాటి లెక్కల ప్రకారం.. ఉద్యోగి బేసిక్ వేతనంలో నుంచి 12 శాతం వారి ఈపీఎఫ్ ఖాతాలోకి వెళుతుంది. సంస్థ మరో 12శాతం ఉద్యోగి తరుపు జమ చేస్తుంది. ఈ జమ చేసిన మొత్తాన్ని ఉద్యోగి అత్యవసర పరిస్థితుల్లో డబ్బులు విత్ డ్రా చేసుకోవచ్చు. లేదంటే ఆ మొత్తాన్ని ఉద్యోగి రిటైరైన తర్వాత ఈపీఎఫ్‌ఓ నెలకు పెన్షన్ రూపంలో అందిస్తుంది.

మమత మేనల్లుడికి ఈడీ సమన్లు

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ అధికార పార్టీకి ఈడీ మరో షాక్ ఇచ్చింది. ఇప్పటికే పాఠశాల ఉద్యోగాల కుంభకోణంలో కీలక నేత పార్థా ఛటర్జీని అరెస్ట్ చేయగా.. తాజాగా ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మేనల్లుడు, టీఎంసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీకి సమన్లు జారీ చేసింది. బొగ్గు అక్రమ రవాణా కుంభకోణం కేసులో భాగంగా శుక్రవారం కోల్‌కతాలోని తమ కార్యాలయంలో విచారణకు హాజరుకావాలని స్పష్టం చేసింది. 'మా అధికారుల ముందు విచారణకు హాజరుకావాలని అభిషేక్ బెనర్జీకి సమన్లు జారీ చేశాం. ఆయనను విచారించేందుకు ఢిల్లీ నుంచి మా అధికారులు వస్తారు' అని ఈడీ అధికారి ఒకరు తెలిపారు. మరోవైపు.. కోల్‌కతాలో ఓ ర్యాలీలో సోమవారం పాల్గొన్న మమత బీజేపీపై విమర్శలు గుప్పించారు. తన మేనల్లుడికి కేంద్ర దర్యాప్తు సంస్థలు నోటీసులు ఇచ్చే అవకాశాలు ఉన్నాయని ఆరోపించారు. ఆమె భావించినట్లుగానే ఆ మరుసటి రోజునే ఈడీ సమన్లు జారీ చేయటం ప్రాధాన్యం సంతరించుకుంది.

అధికారం తలకెక్కింది

- ఆదర్శభావాలను మర్చిపోయారా?
- కేజ్రీవాల్‌కు అన్నాహజారే ఘాటు లేఖ

న్యూఢిల్లీ: ఆమ్‌ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌పై ఆగ్రహం వ్యక్తంచేస్తూ... ప్రముఖ సామాజిక కార్యకర్త అన్నాహజారే మంగళవార లేఖ రాశారు. ఢిల్లీలో మద్యం దుకాణాలను మూసివేయాలని ఆ లేఖలో ఆయన కోరారు. ఢిల్లీలో ప్రభుత్వ ఎక్సైజ్ విధానంపై వస్తున్న వార్తలు చదువుతున్నందుకు తనకు బాధగా ఉందన్నారు. ఢిల్లీలో లిక్కర్ కుంభకోణం చోటు చేసుకుందని బీజేపీ ఆరోపణలు చేయగా, లెఫ్టినెంట్ గవర్నర్ ఆదేశాల మేరకు దర్యాప్తు చేపట్టిన సీబీఐ అధికారులు... ఈ విషయమై ఢిల్లీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియా ఇంట్లో సోదాలు చేశారు. ఈ విషయంలో తెలంగాణ సీఎం కేసీఆర్ కుటుంబ సభ్యుల పాత్ర కూడా ఉందని కూడా బీజేపీ ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మంగళవారం అన్నా హాజారే కేజ్రీవాల్ కు లేఖ రాయడం ప్రాధాన్యత సంతరించుకుంది. స్వరాజ్ అనే పుస్తకంలో మీరు అనేక విషయాలను ప్రస్తావించారని కేజ్రీవాల్ ను ఉద్దేశించి అన్నాహజారే చెప్పారు. రాజకీయాల్లోకి వెళ్లి సీఎం అయిన తర్వాత మీరు మీ ఆదర్శ భావాలను మర్చిపోయినట్టుగా కన్పిస్తుందని హజారే అభిప్రాయపడ్డారు. మద్యం మత్తు ఎలా ఉంటుందో అధికారం అనే మత్తు కూడా అలానే ఉంటుందన్నారు. మీరు కూడా ఈ మత్తులో మునిగిపోయారనే అనుమానం కలుగుతుందని అన్నా హజారే అభిప్రాయపడ్డారు. ఢిల్లీ ప్రభుత్వ ఎక్సైజ్ పాలసీని అన్నా హజారే విమర్శించారు. అధికారాన్ని చేపట్టిన తర్వాత ఆదర్శాలను మరిచిపోయి నట్టుగా కన్పిస్తుందన్నారు. ఈ కారణంగానే ఢిల్లీలో మీ ప్రభుత్వం మద్యం పాలసీని రూపొందించిందని అన్నా హజారే పేర్కొన్నారు. కొత్త ఎక్సైజ్ విధానం మద్య పానాన్ని ప్రోత్సహించేలా ఉందన్నారు. కొత్త మద్యం దుకాణాలు తెరుచుకొనే వెసులుబాటు కూడా కలిగిందన్నారు. ఈ విధానం ద్వారా అవినీతికి తెర తీసే అవకాశం ఏర్పడుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ విధానం ప్రజలకు ఏ మాత్రం ఉపయోగపడదని అన్నా ఆ లేఖలో పేర్కొన్నారు. దేశంలో ఇంత తప్పుడు మద్యపాన విధానం ఎక్కడా లేదని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రజా ప్రయోజనాల కోసం ప్రభుత్వంపై భావసారూప్యత కలిగిన వ్యక్తులు ఒత్తిడి చేస్తే ప్రయోజనం కలిగేదన్నారు. కానీ దీనికి భిన్నంగా పరిస్థితి ఉందని ఆయన చెప్పారు. ఢిల్లీ సర్కార్ తీసుకు వచ్చిన కొత్త ఎక్సైజ్ విధానంపై ఆరోపణలు వచ్చిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. ఈ విధానం ద్వారా పార్టీకి సన్నిహితులైన వారు లబ్ధిపొందారని ఆరోపించారు. 'నువ్వు, మనీశ్ సిసోడియా, అంతా కలిసి ఆమ్ ఆద్మీ పార్టీని స్థాపించారు. కానీ, ఇప్పుడు మిగతా పార్టీలకు మీకు తేడా ఏం లేకుండా పోయింది అని ఆయన లేఖలో మండి పడ్డారు. నేను సూచించినట్లుగా... మనం ఒక గ్రూప్‌గా ఉండి అవగాహన డ్రైవ్ చేపట్టి ఉంటే భారతదేశంలో ఎక్కడా ఇలాంటి తప్పుడు మద్యం విధానం ఏర్పడి ఉండేది కాదేమో... అయినా బలమైన లోక్‌పాల్, అవినీతి వ్యతిరేక చట్టాలకు బదులు... లిక్కర్ పాలసీని తీసుకొచ్చే యత్నం చేశావ్. పైగా అది పూర్తిగా ప్రజా వ్యతిరేక నిర్ణయం' అంటూ లేఖలో హజారే ఆగ్రహం వ్యక్తపర్చారు.

'ముప్పాళ్ల' పోరాటాలు అభినందనీయం

విశాలాంధ్ర-నరసరావుపేట: ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటాలు చేస్తూనే మరోవైపు అగ్రిగోల్డ్ బాధితులకు అండగా నిలిచి ప్రభుత్వం నుంచి పరిహారం ఇప్పించిన సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు ప్రజా పోరాటాలు అభినందనీయమని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర నాయకురాలు జంపని అంజనా దేవి అన్నారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా వరుసగా మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నికైన ముప్పాళ్ల, మంగళవారం పల్నాడు జిల్లా నరసరావుపేట రూరల్ మండలం దొండపాడుకు విచ్చేసిన సందర్భంగా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అనంతరం అంజనా దేవి మాట్లాడుతూ, అగ్రిగోల్డ్ సంస్థ మోసాలకు బలై, ప్రభుత్వ హామీలను నమ్మి ఇబ్బందులు పడుతున్న బాధితులకు నేనున్నానంటూ ముప్పాళ్ల ముందుండి పోరాటాలు చేశారని, ఫలితంగా ప్రభుత్వం దిగివచ్చి తమకు న్యాయం చేకూరిందని అన్నారు.

'అగ్రి' బాధితులకు న్యాయం జరిగేవరకూ పోరాడతా...

ముప్పాళ్ల మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా, కార్మిక, కర్షక, ఉద్యోగ వ్యతిరేక విధానాలపై అన్ని వర్గాల ప్రజలు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం జరిగే వరకూ పోరాటాలు చేస్తామని అన్నారు. అసోసియేషన్ నాయకులు సూర్య నారాయణమ్మ, పెద్దబ్బాయి, బండారు విశ్వేశ్వరరావు, కోదండ రామయ్య, మత్రిపూడి హరిబాబు, కోసూరి కోటేశ్వరమ్మ, సీపీఐ పల్నాడు జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు, సీనియర్ నాయకుడు పగడాల కోటేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు ఉప్పలపాటి రంగయ్య, వైదన వెంకట్, ప్రజానాట్య మండలి కార్యదర్శి షేక్ చిన్న జాన్ సైదా, రాజు, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఆజాద్ దెబ్బకు కశ్మీర్‌లో కాంగ్రెస్ ఖాళీ!



శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లో కాంగ్రెస్ పార్టీకి కోలుకోలేని ఎదురుదెబ్బ తగలనుంది. ఇప్పటికే అగ్రనేత గులాం నబీ ఆజాద్ రాజీనామాతో కాంగ్రెస్ తీవ్ర ఆందోళనకు గురవుతున్న తరుణంలో ఆ రాష్ట్రానికి చెందిన 60మంది సీనియర్ నేతలు కాంగ్రెస్ కు రాజీనామా చేసి ఆజాద్ కొత్త పార్టీలో చేరేందుకు సిద్ధమవుతున్నారు. ఆజాద్ రాజీనామా చేసినప్పటి నుంచి ఇప్పటి వరకు 64 మంది నేతలు పార్టీని వీడారు. ఆజాద్‌కు మద్దతుగా మంగళవారం పార్టీకి రాజీనామా చేసిన వారిలో జమ్మూకశ్మీర్ మాజీ ఉప ముఖ్యమంత్రి తారా చంద్ కూడా ఉన్నారు. వాళ్లంతా కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీకి తమ రాజీనామా లేఖలు సమర్పించారు. తారాచంద్, మాజీ మంత్రులు అబ్దుల్ మజిద్ వానీ, మనోహర్ లాల్ శర్మ, ఘరు రామ్, మాజీ ఎమ్మెల్యే బల్వాన్ సింగ్ సహా అనేకమంది నాయకులు తమ పార్టీ ప్రాథమిక సభ్యత్వం సహా పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు విలేకరుల సమావేశంలో ప్రకటించారు. ఆజాద్‌కు మద్దతుగా సోనియా గాంధీకి లేఖ ద్వారా రాజీనామాలను సమర్పించామని బల్వాన్ సింగ్ తెలిపారు. జమ్మూ కశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి అయిన 73 ఏళ్ల గులాంనబీ కాంగ్రెస్‌తో తన ఐదు దశాబ్దాల అనుబంధాన్ని శుక్రవారం ముగించారు. కాంగ్రెస్ పూర్తిగా నాశనం అయిందని, పార్టీలో సంప్రదింపుల యంత్రాంగాన్ని కూల్చివేశారంటూ రాహుల్ గాంధీపై ఆయన విరుచుకుపడ్డారు. త్వరలో జమ్మూకశ్మీర్ నుంచి జాతీయ స్థాయి పార్టీని ప్రారంభిస్తానని ప్రకటించారు. జమ్మూకశ్మీర్లో మాజీ మంత్రులు, శాసనసభ్యులు సహా దాదాపు డజనుకు పైగా ప్రముఖ కాంగ్రెస్ నాయకులు, వందలాది మంది పంచాయతీరాజ్ సంస్థ (పిఆర్ఐ) సభ్యులు, మున్సిపల్ కార్పొరేటర్లు, జిల్లా, బ్లాక్ స్థాయి నాయకులు ఇప్పటికే కాంగ్రెస్‌ను వీడి ఆజాద్‌కు మద్దతు ప్రకటించారు. ఆజాద్ దెబ్బకు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఖాళీ అయ్యే పరిస్థితి వస్తోంది.

జలచరాల పరిరక్షణకు ప్రయోగాలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: జలచరాలు, వన్యప్రాణులు, తిమింగలం, సొరచేపల సంరక్షణార్థం దీర్ఘకాలిక పరిరక్షణ ప్రయోగాలు చేపట్టాల్సిన అవసరముందని ఆంధ్రప్రదేశ్ అటవీశాఖ ప్రధాన ముఖ్య సంరక్షణాధికారి వై.మధుసూదన్‌రెడ్డి సూచించారు. అటవీశాఖ ప్రధాన కార్యాలయంలో మంగళవారం ఇంటర్నేషనల్ వేల్ షార్క్ డే సందర్భంగా ప్రొటెక్షన్ అండ్ కన్జర్వేషన్ ఎలాన్గ్ ఏపీ కోస్ట్ అంశంపై వెబ్‌నార్ నిర్వహించారు. మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలో తెలిసిన అతిపెద్ద ఉష్ణమండల సొరచేప ఇదని, ఉపరితలానికి దగ్గరగా ఈదుతూ, కేవలం నాచుమొక్కలను ఆహారంగా తీసుకుంటుందని వివరించారు. నీటిలోను, భూమిమీద నివసించే జంతువుల్లో తిమింగలపు సొరచేపే అతిపెద్ద క్షీరదమని ఆయన చెప్పారు. దేశంలో అత్యంత పొడవైన సముద్ర ప్రాంతం రాష్ట్రంలో ఉందని, మొత్తం 974 కిలోమీటర్ల మేర విస్తరించి ఉందన్నారు.

కమలం కుట్రకు అడ్డుకట్ట

- యూపీఏ ఎమ్మెల్యేలు చత్తీస్‌గఢ్‌కు తరలింపు
- జార్ఖండ్‌లో కొనసాగుతున్న రాజకీయ సంక్షోభం

రాంచి : జార్ఖండ్‌లో రాజకీయ సంక్షోభం కొనసాగుతున్న సమయంలో తమ శాసనసభ్యులను వేటాడేందుకు బీజేపీ చేస్తున్న ప్రయత్నాలను నిరోధించేందుకు రాష్ట్రంలోని అధికార సంకీర్ణం తమ ఎమ్మెల్యేలను పొరు గున ఉన్న ఛత్తీస్‌గఢ్‌కు తరలిస్తున్నట్లు మంగళవారం ఆ వర్గాలు తెలిపాయి. ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ నివాసం నుంచి రెండు బస్సులలో రాంచీ విమానాశ్రయం వైపు బయలుదేరిన దృశ్యాలు కనిపించాయని, అక్కడ వారి కోసం రాయ్‌పూర్‌కు విమానం బుక్ చేశారని, సోరెన్ ఒక బస్సులో ఉన్నట్లు వివరించాయి. కాగా తమను బీజేపీయేతర ప్రభుత్వం ఉన్న ఛత్తీస్ గఢ్‌లోని రాయ్‌పూర్‌లోని రిసార్ట్‌కు తరలించవచ్చని కాంగ్రెస్ శాసనసభ్యుడు ఒకరు చెప్పారు. శాసనసభ్యుల కోసం రాయ్ పూర్‌కు విమానం బుక్ చేసినట్లు విమానాశ్రయ వర్గాలు తెలిపాయి. 'మహారాష్ట్ర తరహాలో' ప్రభుత్వాన్ని పడగొట్టే ప్రయత్నంలో భాగంగా బీజేపీ... తమ పార్టీకి చెందిన, అలాగే కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేలను వేటాడేందుకు తీవ్రమైన ప్రయత్నం చేస్తుందని, శాసన సభ్యులను 'సురక్షితమైన ప్రాంతానికి' తరలించాల్సిన అవసరం ఉందని సోరెన్‌కి చెందిన జేఎంఎం

విశ్వసిస్తోంది. లాభదాయకమైన కార్యాలయం కేసులో సోరెన్‌ను అసెంబ్లీకి అనర్హులుగా ప్రకటించాలని కోరుతూ బీజేపీ సమర్పించిన పిటిషన్‌ను అనుసరించి, ఎన్నికల సంఘం తన నిర్ణయాన్ని ఆగస్టు 25న రాష్ట్ర గవర్నర్ రమేష్ బైస్‌కు పంపింది. ఈసీ నిర్ణయం ఇంకా అధికారికంగా వెలువడనప్పటికీ, ఎమ్మెల్యేగా ముఖ్యమంత్రిపై అనర్హత వేటు వేయాలని ఎన్నికల సంఘం సిఫారసు చేసిందని ప్రచారం జరుగుతోంది. అప్పటి నుంచి ఈ విషయంపై రాజ్‌భవన్ ఎలాంటి ప్రకటన చేయలేదు.

వరద ముంపులోనే పాకిస్తాన్

- 2 వేల మందికి పైగా మృతులు
- నిరాశ్రయులైన 3.3 కోట్ల మంది



ఇస్లామాబాద్: పాకిస్తాన్ సగ భాగం వరదలో చిక్కుకుంది. రావి, జీలం, మరో రెండు నదుల వరద ప్రవాహంతో దేశం మునిగిపోయింది. సోమవారం కూడా వరద పరిస్థితి భయంకరంగా కొనసాగింది. వరద ముంపులో చిక్కుకున్న బాధితుల ఫొటోలు తీస్తున్న సైన్యంపై ప్రజలు దాడి చేశారు. ఖైబర్ పఖ్తున్వా, బలూచిస్తాన్, బల్టిస్తాన్‌లో ఆహారం లేదు. కాగా ఈ ఏడాది జూన్ మధ్య నుంచి వరదల కారణంగా మరణించిన వారి సంఖ్య 2 వేలు దాటింది. దాదాపు 3.3 కోట్ల మంది ప్రజలు నిరాశ్రయులయ్యారు. పాకిస్తాన్ అధికారులు చెప్పిన వివరాల ప్రకారం దేశంలో వర్షాలు, వరదలకు సంబంధించిన ఘటనలలో కనీసం 1,136 మంది ప్రాణాలు కోల్పోయారు. మంత్రి షెర్రీ రెహ్మాన్ దీనిని 'దశాబ్దపు రాక్షస రుతుపవనాలు' అని పేర్కొన్నారు. దేశ ఆర్థికమంత్రి మిఫ్తా ఇస్మాయిల్ ప్రకారం వరదలు ఆర్థిక వ్యవస్థపై 10 బిలియన్ డాలర్ల ప్రభావం చూపాయి. వరదల కారణంగా 1,600 మందికి పైగా గాయపడ్డారు. దాదాపు 1,051,570 ఇళ్లు పూర్తిగా లేదా పాక్షికంగా దెబ్బతిన్నాయి. లక్షలాది మంది ప్రజలకు ఆహారం అందడం లేదు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.